VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దిన పత్రిక
రంగారెడ్డి, నల్గొండ : బుధవారం 12.08.2026
సంపుటి : 09 సంచిక : 64 , పేజీలు : 12 , వెల:రూ . 5/-
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH
www.velthuru.com

## నీట్‌కు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ తీర్మానం


3

# పేద పిల్లల కలలకు చిరునామాగా యంగ్ ఇండియా స్కూల్స్

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోస్ట్
- వేగంగా కొనసాగుతున్న నిర్మాణ పనులు
- ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులు
- ప్రపంచస్థాయి విద్యే ప్రభుత్వ లక్ష్యం
- ఆర్థిక అసమానతలకు చెక్ పెట్టడమే ధ్యేయం
- కులం, మతం, ప్రాంతం తేడా లేకుండా విద్య
- పేద పిల్లలకు మెరుగైన అవకాశాలు
- శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యం
- పరిపాలకులు, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సాహం
- తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా పాఠశాలలు
- తరతరాల భవిష్యత్తును మార్చే విద్యాలయాలు


2

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 11:**

తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రతి చిన్నారికి ప్రపంచస్థాయి విద్యను అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఆధునిక సౌకర్యాలతో ఈ విద్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు.ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. కేవలం భవనాలు నిర్మించడం ప్రభుత్వ లక్ష్యం కాదని.. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే అసలు ఉద్దేశమని పేర్కొన్నారు.ఆర్థిక, సామాజిక అసమానతలను తగ్గించడంతో పాటు కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం వంటి భేదాలకు అతీతంగా విద్యా అవకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వ విధానమని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## తెలంగాణ పోస్టల్ సర్కిల్ పునర్వ్యవస్థీకరణకు కేంద్ర మంత్రికి వినతి: రఘునందన్‌రావు

- పోస్టల్ వ్యవస్థను బలోపేతం చేయాలని విజ్ఞప్తి
- కొత్త వరంగల్ రీజియన్ ఏర్పాటు కోరిన ఎంపీ
- వరంగల్‌లోనే ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలని ప్రతిపాదన
- కొత్త పోస్టల్ డివిజన్ల ఏర్పాటుకు విజ్ఞప్తి
- కొత్తగూడెం, మంచిర్యాల, వికారాబాద్ డివిజన్లు కోరిన రఘునందన్‌రావు
- తెలంగాణ బీజేపీ ఎంపీలతో కలిసి కేంద్ర మంత్రికి వినతి


3

## రాష్ట్రంలో పాలన గాడి తప్పింది: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ నేత తీవ్ర విమర్శలు
- అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణకు డిమాండ్
- నాలుగు నెలల్లో రూ.34,900 కోట్ల అప్పు చేశారని ఆరోపణ


2

## జెనోమ్ వ్యాలీలో 'యామ్జెన్' అతి పెద్ద పరిశోధన కేంద్రం

- ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 11:**

గ్లోబల్ దిగ్గజ బయోటెక్నాలజి సంస్థ 'యామ్జెన్' (Amgen) జెనోమ్ వ్యాలీలో అత్యాధునిక పరిశోధన, ఆవిష్కరణల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది.

▶ మిగతా 2లో

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను భావితరాలకు చాటి చెప్పాలి

- ఆగస్టు 21న విడుదల కానున్న 'సర్దార్ సర్వాయి పాపన్న' సినిమా ట్రైలర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్


2

## ఓల్డ్ సిటీ మెట్రో పనుల్లో వేగం పెంచండి

- వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలి
- మెట్రో రద్దీకి అనుగుణంగా కొత్త కోచ్ లు కొనుగోలు చేయాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


11

## చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తులు అర్హతల్లో మార్పుల్లేవు



- గతంలో అమల్లో ఉన్న మార్గదర్శకాల ప్రకారమే కొత్త పింఛన్లు
- ఆగస్టు 31 వరకు దరఖాస్తుల స్వీకరణ:మంత్రి సీతక్క

2

## తెలంగాణలో 3.38 కోట్ల మంది ఓటర్లు



## నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తి కావాల్సిందే

- నిర్లక్ష్యాన్ని,పనుల్లో ఆలస్యాన్ని అస్సలు సహించేది లేదు
- ప్రజలకు మాట ఇచ్చాం మాట ప్రకారం చేసి తీరాల్సిందే
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పూర్తి జవాబు దారిగా వ్యవహరిస్తుంది
- ఏళ్ల తరబడి అవస్థ పడుతున్న ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేద్దాం అధికారులు మనసుపెట్టి పనిచేయండి
- మ్యాన్ పవర్ పెంచి మూడు షిఫ్టుల్లో పనులు చేయాలి..రాత్రి వేళల్లో 11 నుండి ఉదయం 6గంటల వరకు నిరంతరాయంగా పనులు జరగాలి
- కారిడార్ కింద బిటి రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాల్సిందే
- అటు నారపల్లి(CPRI) వైపు నుండి, ఇటు ఉప్పల్ వైపు నుండి ఇరువైపుల లాంచింగ్ గడ్డర్లతో పనులు వేగం పెంచాలి


11

## పత్తికి ఎంఎస్పీ కంటే తక్కువ ధర వద్దు


11

## హైదరాబాద్‌లో ఓట్ల తగ్గుదలపై కాంగ్రెస్ అప్రమత్తం..

- బీఎల్ఓలకు కీలక సూచనలు
- నాలుగు పార్లమెంట్ స్థానాలపై జూమ్ సమావేశం
- ఓట్ల తగ్గుదలపై మహేష్ కుమార్ గౌడ్ ఆందోళన


2

## ఎస్ఐఆర్‌లో అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకుండా బీఆర్ఎస్ పోరాటం

- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- 74 లక్షల ఓట్లు అన్‌కలెక్టబుల్‌గా ఉండటం ఆందోళనకరం
- 60 లక్షల ఓట్లలో అనామలీస్ ఉన్నట్లు సమాచారం


2

- అర్హుల ఓట్లు తొలగిపోకుండా చర్యలు
- ముసాయిదా జాబితా తర్వాత జిల్లాల వారీగా భేటీలు
- లీగల్ సెల్‌తో ఇప్పటికే చర్చలు
- న్యాయ నిపుణుల సలహాలు తీసుకున్న బీఆర్ఎస్

# పేద పిల్లల కలలకు చిరునామాగా యంగ్...

(మొదటి పేజీ తరువాయి)

విద్యలో సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలు కూడా ఉన్నత స్థాయికి ఎదగడానికి అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కేవలం విద్యా సంస్థలుగా కాకుండా.. విద్యార్థుల కలలకు పునాదులు వేసే జ్ఞాన కేంద్రాలుగా మారాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం తెలిపారు.ఈ పాఠశాలల్లో చదివే పేద కుటుంబాల పిల్లలు భవిష్యత్తులో శాస్త్రవేత్తలు, పరిపాలకులు, పారిశ్రామికవేత్తలు, నవభారత నిర్మాతలుగా ఎదగాలని ఆకాంక్షించారు. అందుకు అవసరమైన నాణ్యమైన విద్య, వసతులను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.పేద పిల్లల కలలకు చిరునామాగా, తెలంగాణ విద్యా విధానానికి ప్రతీకగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిలవనున్నాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విద్యాలయాల ద్వారా రాబోయే తరాల భవిష్యత్తులో గణనీయమైన మార్పు తీసుకురావాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని సీఎం స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో ఓట్ల తగ్గుదలపై కాంగ్రెస్ అప్రమత్తం..

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 11:**

హైదరాబాద్ పరిధిలో ఓట్ల సంఖ్య తగ్గుతున్న అంశంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. జహీరాబాద్, మెదక్, మల్కాజిగిరి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించిన పార్టీ నేతలతో మంగళవారం రోజున జూమ్ సమావేశం నిర్వహించారు. ఓట్ల జాబితాలో చోటుచేసుకుంటున్న మార్పులపై అప్రమత్తంగా వ్యవహరించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పార్టీ నేతలకు సూచించారు.హైదరాబాద్ పరిధిలో ఓట్లు గణనీయంగా తగ్గిపోతున్నాయని సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. ఈ అంశంపై పార్టీ యంత్రాంగం గట్టి నిఘా పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల జాబితాలో అనుమానాస్పదంగా కనిపించే ఓట్లను పరిశీలించడం ప్రస్తుతం అత్యంత కీలకమని చెప్పారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు.బూత్ స్థాయిలో పనిచేసే బీఎల్ఓలు మరింత అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షుడు సూచించారు. ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించి, ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న మార్పులను లోతుగా అధ్యయనం చేయాలని చెప్పారు. సంబంధిత అంశాలపై క్షేత్రస్థాయి నాయకులు నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు.ఈ జూమ్ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, కో–ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ గంప వేణు, ఎలక్షన్ కమిటీ చైర్మన్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు. నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, కో–ఆర్డినేటర్లు కూడా సమావేశంలో పాల్గొన్నారు.మరోవైపు ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ గత రెండు రోజులుగా టీపీసీసీ ఉపాధ్యక్షులతో వరుసగా వన్ టు వన్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై వారితో వ్యక్తిగతంగా చర్చించారు. ఉపాధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వారు నిర్వహించిన రాజకీయ కార్యక్రమాలు, పార్టీ కోసం చేపట్టిన కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు.ఇక రేపటి నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శులతో సచిన్ సావంత్ ముఖాముఖి సమావేశాలు నిర్వహించనున్నారు. గాంధీభవన్‌లో జరిగే ఈ భేటీల్లో పార్టీ సంస్థాగత పరిస్థితి, నాయకుల పనితీరు, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలపై చర్చించే అవకాశం ఉంది.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను భావితరాలకు...

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 11, 2026:**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా ఆగస్టు 21న విడుదల కానున్న 'సర్దార్ సర్వాయి పాపన్న' సినిమా ట్రైలర్‌ను మినిస్టర్ క్వార్టర్స్ లో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని,పోస్టర్ కూడా చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బహుజన రాజ్యాన్ని స్థాపించి, మన ప్రాంతాన్ని మనమే పరిపాలించుకోవాలనే ఆలోచనతో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం సాగించారని అన్నారు. గోల్కొండను వేదికగా చేసుకొని బహుజన రాజ్యాన్ని స్థాపించేందుకు ఆయన కృషి చేశారని తెలిపారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అనేక కోటలను జయించి, గోల్కొండ కోట వరకు తన సామ్రాజ్యాన్ని విస్తరించారని మంత్రి పేర్కొన్నారు. సామాజిక సమానత్వం, స్వయం పాలన, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రను, ఆయన చేసిన పోరాటాలను నేటి తరానికి, భావి తరాలకు పరిచయం చేయడంలో సినిమా, పుస్తకాలు కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి అన్నారు. ఆయన చరిత్రను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడం అభినందనీయమని మంత్రి తెలిపారు. పాపన్న గౌడ్ చరిత్రను వెండితెరపై ఆవిష్కరిస్తున్న చిత్ర యూనిట్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు పతాని రామకృష్ణ, దర్శకుడు, నిర్మాత లింగంపల్లి వెంకటేష్ గౌడ్, డిస్ట్రిబ్యూటర్ పేపర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జెనోమ్ వ్యాలీలో 'యామ్జెన్' అతి పెద్ద పరిశోధన కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు మంగళవారం నాడు సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ప్రభుత్వంతో ఎంఓయు చేసుకుంది. అంతకు ముందు శ్రీధర్ బాబుతో బేటీ అయిన యామ్జెన్ ఇండియా ప్రతినిధులు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాల విస్తరణపై చర్చించారు. సమావేశానంతరం యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, తెలంగాణా ప్రభుత్వ పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్యలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. జెనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశోధన కేంద్రంలో 200 మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వెల్లడించారు. యామ్జెన్ ఇటీవల 3 వేల మంది ఉద్యోగులతో అతి పెద్ద జీసిసి ని ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. ఔషధ రంగ దిగ్గజ కంపెనీలు తెలంగాణా పట్ల అపార విశ్వాసం కనబర్చడం తమ ప్రభుత్వానికి దక్కిన గౌవరమని ఆయన అన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీలకు రాష్ట్రం ఒక ముఖ్యమైన వేదికగా మారడం పట్ల శ్రీధర్ బాబు సంతోషం వ్యక్తం చేసారు. ఉద్యోగ అవకాశాల్లో ఇక్కడి యువతకు ప్రాధాన్యతనిచ్చి నియామకాలు జరపాలని యామ్జెన్ యాజమాన్యానికి ఆయన సూచించారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, జీనోమ్ వ్యాలీ వంటి అభివృద్ధి చెందిన ఎకోసిస్టమ్ కారణంగా తెలంగాణ ప్రపంచ లైఫ్ సైన్సెస్ సంస్థలకు కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన అన్నారు. దాదాపు 100 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న యామ్జెన్ క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఎముకల ఆరోగ్యం, ఇన్ఫ్లమేషన్, శ్వాసకోశ వ్యాధులు, అరుదైన వ్యాధులు తదితర తీవ్రమైన అనారోగ్య సమస్యలకు వినూత్న చికిత్సలను అభివృద్ధి చేస్తోంది. ఎంఓయు కార్యక్రమంలో పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్, యామ్జెన్ ఇండియా ఎండీ నవీన్ గుళ్లపల్లి, ఇడి శ్రీను కొసరాజు, అనుమిత తదితరులు పాల్గొన్నారు.

# చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తులుఅర్హతల్లో మార్పుల్లేవు

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 11:**

అర్హులైన పేదలు, బలహీన వర్గాలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా చేయూత సామాజిక భద్రత పింఛన్ పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తొలిదశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు. కొత్త పింఛన్ల కోసం అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు చేయలేదు. గత ప్రభుత్వాల హయాంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న ఎలిజిబిలిటీ క్రైటీరియానే ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రామాణికంగా తీసుకుంటోంది. 2014 నుంచి 2018 మధ్య జారీ చేసిన సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల్లోని నిబంధనల ప్రకారమే అర్హతను పరిశీలిస్తారు.ప్రజాపాలన వారోత్సవాలు, 99 రోజుల ప్రగతి ప్రణాళిక గ్రామసభలు, ప్రజావాణిలో ఇప్పటికే అందిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. గతంలో దరఖాస్తు చేసి, అవసరమైన అన్ని పత్రాలు సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. అవసరమైన పత్రాలు సమర్పించని వారు లేదా ఇప్పటి వరకు దరఖాస్తు చేయని అర్హులు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు.అర్హత నిర్ధారణ కోసం సంబంధిత శాఖల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను పొందేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుంటారు.

వితంతువులకు భర్త మరణ ధ్రువపత్రం, ఒంటరి మహిళలకు సెపరేషన్ లేదా స్థానిక విచారణ నివేదిక, గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ, చేనేత కార్మికులకు చేనేత–జౌళి శాఖ ధ్రువీకరణ, ఫైలేరియా బాధితులకు వైద్య ఆరోగ్య శాఖ ధ్రువీకరణ అవసరం.దరఖాస్తుల పరిశీలన అనంతరం నిర్దేశిత అధికారులు క్షేత్రస్థాయిలో అర్హతను తనిఖీ చేస్తారు. ఆ తర్వాత అర్హుల జాబితాను జిల్లా స్థాయికి పంపి, జిల్లా కలెక్టర్ ఆమోదంతో పింఛన్ మంజూరు ప్రక్రియ పూర్తి చేస్తారు.ప్రతి అర్హుడికి చేయూత అందించాలనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల సమాఖ్యలకు కూడా బాధ్యతలు అప్పగించారు. ముఖ్యంగా ప్రతి అర్హత కలిగిన వితంతువు, ఒంటరి మహిళకు దరఖాస్తు చేసుకోవడం, అవసరమైన ధ్రువపత్రాలు పొందడంలో సహకరించాలని సూచించారు.కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను ఆగస్టు 31, 2026 వరకు స్వీకరిస్తారు.

దరఖాస్తులతో పాటు వివరాలను చేయూత పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను కూడా వెంటనే చేపట్టనున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. గతంలో ఉన్న అర్హత నిబంధనలనే కొనసాగిస్తూ, అర్హులైన వారికి సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రక్రియను వేగవంతం చేసింది.

# ఎస్ఐఆర్‌లో అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకుండా బీఆర్ఎస్ పోరాటం

- **ఓటర్లకు అండగా పార్టీ యంత్రాంగం**
- **ఆగస్టు 13, 14న సమావేశాలకు సన్నాహాలు**
- **కేసీఆర్‌తో చర్చించిన తర్వాత కార్యాచరణ**
- **అర్హుల ప్రతి ఓటును కాపాడతామన్న కేటీఆర్**

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 11:**

తెలంగాణలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SIR) ప్రక్రియలో అర్హులైన ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా బీఆర్ఎస్ పోరాడుతుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. అర్హులైన ఒక్క ఓటు కూడా అన్యాయంగా తొలగిపోకుండా చూడటం అత్యంత కీలకమని అన్నారు. ఈ అంశంపై పార్టీ పరంగా, న్యాయపరంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ SIR కమిటీతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, ఓటర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు తెలంగాణలో మొత్తం 3.39 కోట్ల ఓట్లు ఉన్నాయని కేటీఆర్ తెలిపారు. అందులో దాదాపు 73 నుంచి 74 లక్షల ఓట్లు 'అన్‌కలెక్టబుల్'గా ఉన్నాయని, వాటిపై ఇప్పటివరకు స్పందన రాలేదని ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమాచారం చెబుతోందన్నారు. ఇంత భారీ సంఖ్యలో ఓట్లు అన్‌కలెక్టబుల్‌గా ఉండటం ఆందోళన కలిగించే అంశమని చెప్పారు.అన్‌కలెక్టబుల్‌గా ఉన్న ఓట్లలో చాలా వరకు తొలగించే అవకాశం ఉందన్న పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోందని కేటీఆర్ అన్నారు. అదేవిధంగా సుమారు 60 లక్షల ఓట్లలో అనామలీస్ ఉన్నట్లు సమాచారం ఉందని తెలిపారు. మొత్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే సమయానికి సుమారు రెండు కోట్ల ఓట్లు మాత్రమే ఎలాంటి సమస్యలు లేకుండా మిగిలే పరిస్థితి కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.మిగిలిన ఓట్లలో కొన్ని తొలగిపోయే అవకాశం ఉండగా.. మరికొన్ని ఓట్ల విషయంలో తప్పులు, అనుమానాలు ఉన్నట్లు ఎన్నికల కమిషన్ నుంచి సమాచారం వస్తోందని కేటీఆర్ చెప్పారు. ఈ నేపథ్యంలో నిజంగా అర్హులైన ఓటర్ల పేర్లు కూడా జాబితా నుంచి తొలగిపోతున్నట్లు కనిపిస్తోందని అన్నారు.ఎన్నికల అధికారులు త్వరలో ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించనున్నారని కేటీఆర్ తెలిపారు. ఆ జాబితా విడుదలైన తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించాలని పార్టీ నిర్ణయించిందన్నారు. స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు.ఇప్పటికే పార్టీ లీగల్ సెల్‌తో సమావేశం నిర్వహించామని కేటీఆర్ తెలిపారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోయినట్లయితే వారికి న్యాయం చేసేందుకు తీసుకోవాల్సిన న్యాయపరమైన చర్యలపై న్యాయ నిపుణులతో చర్చించినట్లు చెప్పారు. అలాగే పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, బాధిత ఓటర్లకు అండగా పార్టీ శ్రేణులను ఎలా క్రియాశీలం చేయాలనే అంశాలపై కూడా చర్చించినట్లు వెల్లడించారు.ఆగస్టు 13, 14 తేదీల్లో కొన్ని సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌తో చర్చించిన అనంతరం సమావేశాలకు సంబంధించిన పూర్తి వివరాలు, కార్యాచరణను వెల్లడిస్తామని చెప్పారు. జిల్లాల వారీగా జరిగే సమావేశాల్లో స్థానిక పరిస్థితులను సమీక్షించి, అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షించేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా బీఆర్ఎస్ కృషి చేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయిలో పూర్తిగా అప్రమత్తం చేసి, ఓటర్లకు అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు.

# రాష్ట్రంలో పాలన గాడి తప్పింది: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

- **ఉద్యోగులు, కాంట్రాక్టర్ల బకాయిలపై ప్రశ్నలు**
- **ఫ్యూచర్ సిటీ, మూసీ పనులపై తీవ్ర ఆరోపణలు**
- **సింగరేణి వ్యవహారంలో అక్రమాలు జరిగాయన్న వ్యాఖ్యలు**
- **ప్రభుత్వం 'ఆ నలుగురి ప్రభుత్వం'గా మారిందని విమర్శ**
- **ఏసీబీ, లోకాయుక్త సుమోటో విచారణకు డిమాండ్**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 11:**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను గాడి తప్పించిందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ నేత డిప్యూటీ సీఎం సతీమణిపై 10 శాతం కమిషన్ ఆరోపణలు చేశారని, గతంలో డిప్యూటీ సీఎం చాంబర్‌లో 30 శాతం కమిషన్ అడుగుతున్నారంటూ కాంట్రాక్టర్లు ఆందోళన చేశారని గుర్తుచేశారు.30–40 ఏళ్ల పాటు పనిచేసిన ఉద్యోగులకు రిటైర్మెంట్ ప్రయోజనాలు అందడం లేదని, కోర్టు ఆదేశాలను కూడా ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. ఫైనాన్స్ సెక్రటరీకి బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ కావడం ప్రభుత్వ అధికారుల తీరుకు నిదర్శనమన్నారు.గత నాలుగు నెలల్లో ప్రభుత్వం రూ.34,900 కోట్ల అప్పు చేసిందని, మరోవైపు భారీగా బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.15 వేల కోట్లు, ఆరోగ్యశ్రీ రూ.1,500 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాలు రూ.8 వేల కోట్లు, ఉద్యోగుల బకాయిలు రూ.6 వేల కోట్లుగా ఉన్నాయని పేర్కొన్నారు. పంచాయతీలు, మున్సిపాలిటీలు, ఆర్టీసీ, సింగరేణికి కూడా భారీగా బకాయిలు ఉన్నాయని అన్నారు.ఫ్యూచర్ సిటీ, మూసీ, ఫార్మా సిటీ తదితర ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ, ప్రజా అవసరాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. హైదరాబాద్‌లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలు ఉన్నా కొందరు కాంట్రాక్టర్లకే బిల్లులు చెల్లిస్తున్నారని విమర్శించారు.సింగరేణి బొగ్గు కొనుగోళ్లలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపించిన మహేశ్వర్ రెడ్డి.. నైని కోల్ టెండర్ వ్యవహారంపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం 'ఆ నలుగురి ప్రభుత్వం'గా మారిందని, ప్రజాస్వామ్యానికి బదులుగా క్రోనీ క్యాపిటలిజం వచ్చిందని వ్యాఖ్యానించారు.రిటైర్డ్ ఉద్యోగులు, చిన్న కాంట్రాక్టర్లు చేసిన కమిషన్ ఆరోపణలపై ఏసీబీ, లోకాయుక్త సుమోటోగా విచారణ చేపట్టాలని ఆయన కోరారు. బాధితులకు బీజేపీ అండగా ఉంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు.

# తెలంగాణలో 3.38 కోట్ల మంది ఓటర్లు

- **73 లక్షలకు పైగా ఫారాలు అన్‌కలెక్టబుల్**
- **ఎస్ఐఆర్‌లో కీలక గణాంకాలు వెల్లడి**
- **3.38 కోట్ల మంది ఓటర్ల గుర్తింపు**
- **2.64 కోట్ల ఫారాల డిజిటైజేషన్ పూర్తి**
- **78.30 శాతం ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తి**
- **73.39 లక్షల ఫారాలు అన్‌కలెక్టబుల్**
- **45.18 లక్షల మంది ఇతర ప్రాంతాలకు తరలింపు**
- **11.25 లక్షల మంది ఆచూకీ లేనివారు**
- **9.22 లక్షల మంది మృతులుగా గుర్తింపు**
- **6.70 లక్షల మందికి మరోచోట ఓటు**
- **ఓటర్ల జాబితా ప్రక్షాళనపై దృష్టి**

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 11:**

తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యుమరేషన్ ప్రక్రియలో కీలక గణాంకాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల వివరాల సేకరణ, పరిశీలన అనంతరం మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పరిస్థితిపై మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు.రాష్ట్రంలో గుర్తించిన మొత్తం ఓటర్లలో 2,64,87,214 ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటైజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. దీంతో ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ప్రక్రియలో 78.30 శాతం పూర్తయినట్లు వెల్లడించారు. మరో 73,39,234 ఫారాలు, అంటే 21.70 శాతం, అన్‌కలెక్టబుల్ కేటగిరీలో నమోదయ్యాయి.అన్‌కలెక్టబుల్ ఫారాల్లో అత్యధికంగా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయినవారివే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మొత్తం 45,18,961 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయినట్లు నమోదు చేశారు. వీరి ఓటరు వివరాలను తదుపరి దశలో నిబంధనల ప్రకారం పరిశీలించాల్సి ఉంటుందని ఎన్నికల అధికారులు తెలిపారు.మరోవైపు 11,25,546 మంది గైర్హాజరు లేదా ఆచూకీ లేని వారిగా 'అన్‌ట్రేస్డ్' కేటగిరీలో నమోదయ్యారు. అలాగే 9,22,230 మంది మరణించినవారిగా గుర్తించారు. వీరి పేర్లను ఓటరు జాబితాలో కొనసాగించాలా, తొలగించాలా అనే అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించనున్నారు.ఎస్ఐఆర్ పరిశీలనలో 6,70,203 మంది ఓటర్లు ఇప్పటికే మరోచోట ఓటర్లుగా నమోదై ఉన్నట్లు గుర్తించారు. ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటరు నమోదులు ఉన్నాయా అనే అంశంపై ఎన్నికల యంత్రాంగం తదుపరి పరిశీలన చేపట్టనుంది. వీటితో పాటు 1,02,294 ఫారాలను ఇతరుల కేటగిరీలో చేర్చినట్లు అధికారులు వెల్లడించారు.

## ఓటరు జాబితా ప్రక్షాళనే లక్ష్యం

ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడమే ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని ఎన్నికల అధికారులు తెలిపారు. అర్హత ఉన్న ఓటర్ల పేర్లను కొనసాగిస్తూ.. మరణించినవారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయినవారు, మరోచోట ఓటరుగా నమోదైనవారి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించనున్నట్లు చెప్పారు.మొత్తం 73.39 లక్షలకుపైగా ఫారాలు అన్‌కలెక్టబుల్‌గా నమోదు కావడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. అయితే అన్‌కలెక్టబుల్‌గా నమోదైన ప్రతి ఓటు తుది జాబితా నుంచి తొలగించినట్లుగా భావించరాదని, తదుపరి పరిశీలన, అభ్యంతరాలు, నిబంధనల ప్రకారం తుది నిర్ణయం ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. సర్ ప్రక్రియ పూర్తయ్యే కొద్దీ తెలంగాణ ఓటరు జాబితాలో వాస్తవంగా ఎంతమంది అర్హులైన ఓటర్లు కొనసాగుతారు, ఎన్ని పేర్లపై అభ్యంతరాలు వస్తాయి, ఎంతమంది పేర్లు తొలగింపు లేదా మార్పులకు గురవుతాయన్నది కీలకంగా మారనుంది.

# ప్రసన్న కుమార్ శర్మ నివాసానికి అనిల్ శాస్త్రి దంపతులు

## అనిల్ శాస్త్రి దంపతుల రాక ఎంతో ఆనందాన్ని కలిగించింది: పి. ప్రసన్న కుమార్ శర్మ





హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 11:

ప్రముఖ మాజీ కేంద్ర మంత్రివర్యులు, దేశ మాజీ ప్రధానమంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి గారి కుమారులు శ్రీ అనిల్ శాస్త్రి గారు, ఆయన సతీమణి శ్రీమతి మంజులా శాస్త్రి గారు తన నివాసానికి విచ్చేయడం ఎంతో సంతోషంగా, ఆనందంగా ఉందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ తెలిపారు."జై జవాన్ – జై కిసాన్" అనే నినాదంతో భారతదేశ కర్షకులు, సైనికులు, కార్మికులు, యువతతో పాటు యావత్ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపిన మహానేత, మాజీ ప్రధానమంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి గారి కుమారులు శ్రీ అనిల్ శాస్త్రి గారు తన నివాసానికి విచ్చేయడం తనకు ఎంతో గౌరవంగా భావిస్తున్నానని ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు.దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్న సమయంలో ధైర్యం, దేశభక్తి, క్రమశిక్షణతో భారతదేశానికి నాయకత్వం వహించి, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషించిన లాల్ బహదూర్ శాస్త్రి గారి సేవలు చిరస్మరణీయమని ఆయన అన్నారు.

అటువంటి మహనీయుడి కుమారుడు శ్రీ అనిల్ శాస్త్రి గారు, శ్రీమతి మంజులా శాస్త్రి గారు తన ఇంటికి రావడం తనకు ఎంతో ఆత్మీయతతో కూడిన ఆనందాన్ని కలిగించిందని పి. ప్రసన్న కుమార్ శర్మ తెలిపారు.

- అనిల్ శాస్త్రి దంపతుల రాకతో ప్రసన్న కుమార్ శర్మ నివాసంలో ఆత్మీయ వాతావరణం
- దేశ సేవలో లాల్ బహదూర్ శాస్త్రి వారసత్వాన్ని కొనసాగిస్తున్న అనిల్ శాస్త్రి గారు: పి. ప్రసన్న కుమార్ శర్మ

భారత జాతీయ కాంగ్రెస్‌లో సుదీర్ఘకాలంగా వివిధ బాధ్యతలను నిర్వహిస్తూ, జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రి శ్రీ అనిల్ శాస్త్రి గారు, ఆయన సతీమణి శ్రీమతి మంజులా శాస్త్రి గారు తన నివాసానికి విచ్చేయడం ఎంతో ఆనందంగా, గౌరవంగా ఉందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ తెలిపారు.

మహనీయుడు, మాజీ ప్రధానమంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి గారి కుమారుడిగా మాత్రమే కాకుండా, స్వయంగా ప్రజాజీవితంలో సుదీర్ఘ అనుభవాన్ని సంపాదించిన జాతీయ నాయకుడిగా శ్రీ అనిల్ శాస్త్రి గారికి ప్రత్యేక గుర్తింపు ఉందని ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు.

శ్రీ అనిల్ శాస్త్రి గారు 1989లో వారణాసి నియోజకవర్గం నుంచి 9వ లోక్‌సభకు ఎన్నికయ్యారు.

అనంతరం 1990లో భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖలో మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. భారత ప్రభుత్వ ఆర్థిక శాఖకు సంబంధించిన అధికారిక రికార్డుల్లో కూడా ఆయన పేరు 1990 సంవత్సరానికి మంత్రిగా నమోదై ఉంది.

- రాజకీయ జీవితానికి ముందు శ్రీ అనిల్ శాస్త్రి గారు టాటా గ్రూప్‌కు చెందిన వోల్టాస్ సంస్థలో సుమారు 17 సంవత్సరాల పాటు సీనియర్ స్థాయిలో పనిచేశారు. ఆర్థిక శాస్త్రంలో విద్యాభ్యాసం చేసిన ఆయనకు పరిపాలన, ఆర్థిక వ్యవహారాలు, సంస్థాగత నిర్వహణపై విశేష అనుభవం ఉంది. (LBS Institute of Management)

### కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘ సేవలు

రాజకీయ జీవితంలో వివిధ దశల్లో బాధ్యతలు నిర్వహించిన శ్రీ అనిల్ శాస్త్రి గారు అనంతరం భారత జాతీయ కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా కొనసాగారు. కాంగ్రెస్‌లో వివిధ సంస్థాగత బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు.

ఆయనకు పార్టీ వ్యవహారాల్లో ఉన్న సుదీర్ఘ అనుభవం, ముఖ్యంగా వివిధ రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత వ్యవహారాలపై ఉన్న అవగాహన ప్రత్యేకమైనదని ప్రసన్న కుమార్ శర్మ తెలిపారు.

శ్రీ అనిల్ శాస్త్రి గారు కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ సంస్థాగత కార్యక్రమాల్లో కీలకంగా పాల్గొనడంతో పాటు, జాతీయ స్థాయిలో పార్టీ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తన వంతు పాత్ర పోషించారు.

### అంతర్జాతీయ వేదికలపై భారతదేశానికి ప్రాతినిధ్యం

శ్రీ అనిల్ శాస్త్రి గారు కేవలం భారత రాజకీయాలకే పరిమితం కాకుండా అనేక అంతర్జాతీయ సదస్సులు, సమావేశాల్లో పాల్గొన్నారు. అమెరికా, చైనా, రష్యా, బల్గేరియా, మెక్సికో, వియత్నాం, నేపాల్, దక్షిణ కొరియా, అర్జెంటీనా, కజకిస్థాన్, శ్రీలంక తదితర దేశాల్లో జరిగిన అంతర్జాతీయ కార్యక్రమాల్లో పాల్గొని భారతదేశానికి సంబంధించిన వివిధ అంశాలపై తన అభిప్రాయాలను, అనుభవాలను పంచుకున్నారు. (LBS Institute of Management)

దేశ ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్య విలువలు, పరిపాలన, అంతర్జాతీయ సంబంధాలు వంటి అంశాలపై జాతీయ, అంతర్జాతీయ వేదికల్లో ఆయన చేసిన ప్రసంగాలు ఆయన విస్తృత అనుభవానికి నిదర్శనమని ప్రసన్న కుమార్ శర్మ అన్నారు.

### లాల్ బహదూర్ శాస్త్రి వారసత్వానికి ప్రతీక

"జై జవాన్ – జై కిసాన్" అనే మహత్తర నినాదంతో దేశ సైనికులకు, రైతులకు స్ఫూర్తినిచ్చిన మాజీ ప్రధానమంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి గారి వారసత్వాన్ని ఆయన కుటుంబ సభ్యులు తమ తమ రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారని ప్రసన్న కుమార్ శర్మ అన్నారు.

లాల్ బహదూర్ శాస్త్రి గారి సరళత, నిజాయితీ, దేశభక్తి, క్రమశిక్షణ, ప్రజాసేవా విలువలు నేటి తరానికి కూడా ఆదర్శప్రాయమని ఆయన పేర్కొన్నారు.

అటువంటి మహనీయుడి కుమారులు శ్రీ అనిల్ శాస్త్రి గారు తన నివాసానికి సతీసమేతంగా విచ్చేయడం తనకు ఎంతో ఆత్మీయమైన, గౌరవప్రదమైన సందర్భమని పి. ప్రసన్న కుమార్ శర్మ తెలిపారు.

శ్రీ అనిల్ శాస్త్రి గారి వంటి సీనియర్ జాతీయ నాయకుల అనుభవం, మార్గదర్శకత్వం కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడూ విలువైనదని, వారి ఆశీస్సులు మరియు సూచనలు పార్టీని మరింత బలోపేతం చేయడానికి దోహదపడతాయని ప్రసన్న కుమార్ శర్మ అన్నారు.

శ్రీ అనిల్ శాస్త్రి గారు, శ్రీమతి మంజులా శాస్త్రి గారు తన నివాసానికి విచ్చేసిన సందర్భంగా వారికి హృదయపూర్వక స్వాగతం, సాదర అభినందనలు తెలియజేస్తున్నానని పి. ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు.

# తెలంగాణ పోస్టల్ సర్కిల్ పునర్వ్యవస్థీకరణకు కేంద్ర మంత్రికి వినతి: రఘునందన్‌రావు

- కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతి
- ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరణ
- ప్రజలకు పోస్టల్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యం
- కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందన్న ఆశాభావం

న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 11:

తెలంగాణ పోస్టల్ సర్కిల్‌ను ప్రజల అవసరాలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించాలని కోరుతూ కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కె.విశ్వేశ్వర్‌రెడ్డి, గోదాం నాగేశ్‌లతో కలిసి కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.తెలంగాణలో పోస్టల్ పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కొత్త వరంగల్ రీజియన్‌ను ఏర్పాటు చేయాలని కోరినట్లు రఘునందన్‌రావు తెలిపారు. ఈ రీజియన్‌కు వరంగల్‌ను ప్రధాన కార్యాలయంగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు చెప్పారు.అదేవిధంగా ప్రస్తుతం ఉన్న సంబంధిత పోస్టల్ డివిజన్లను విభజించి కొత్తగూడెం, మంచిర్యాల, వికారాబాద్ కేంద్రాలుగా కొత్త పోస్టల్ డివిజన్లు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు వెల్లడించారు.తెలంగాణలో విస్తరిస్తున్న జనాభా, పెరుగుతున్న పరిపాలనా అవసరాలు, ప్రజలకు పోస్టల్ సేవలను మరింత వేగంగా అందించాల్సిన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పోస్టల్ సర్కిల్ పునర్వ్యవస్థీకరణ అవసరమని రఘునందన్‌రావు తెలిపారు.

కొత్త రీజియన్, కొత్త డివిజన్ల ఏర్పాటు ద్వారా ఆయా ప్రాంతాల్లో పోస్టల్ సేవల నిర్వహణ మరింత సులభతరం అవుతుందని, ప్రజలకు సేవలు వేగంగా అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగులు, పోస్టల్ సిబ్బందిపై ఉన్న పరిపాలనా భారం కూడా తగ్గుతుందని తెలిపారు.తెలంగాణ అభివృద్ధికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ శాఖల పరిపాలనా వ్యవస్థలను కూడా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని రఘునందన్‌రావు అన్నారు. పోస్టల్ సర్కిల్ పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



# నీట్‌కు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ తీర్మానం

- నీట్ రద్దు చేయాలని డిమాండ్
- ఆరోగ్య మంత్రి అరుణ్‌రాజ్ తీర్మానం
- డీఎంకే, అన్నాడీఎంకే మద్దతు
- భాజపా సభ్యుల సభ నుంచి వాకౌట్
- కోచింగ్ సంస్కృతిపై ప్రభుత్వ ఆందోళన
- గ్రామీణ విద్యార్థులకు నష్టం
- సామాజిక న్యాయానికి విఘాతం అంటున్న ప్రభుత్వం



చెన్నై, వెలుతురు, ఆగస్టు 11:

వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్షను రద్దు చేయాలన్న డిమాండ్‌తో తమిళనాడు అసెంబ్లీ మరోసారి గళమెత్తింది. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం అసెంబ్లీలో నీట్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఆరోగ్యశాఖ మంత్రి కె. అరుణ్‌రాజ్ మంగళవారం తీర్మానాన్ని సభ ముందుకు తీసుకొచ్చారు.ఈ తీర్మానానికి ప్రధాన ప్రతిపక్షాలైన డీఎంకే, ఏఐఏడీఎంకే మద్దతు ప్రకటించాయి. టీవీకేకు మిత్రపక్షాల నుంచి కూడా మద్దతు లభించింది. అయితే భాజపా సభ్యులు తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు.తీర్మానంపై మాట్లాడిన మంత్రి అరుణ్‌రాజ్.. నీట్ కారణంగా వైద్య విద్య కోసం విద్యార్థులు కోచింగ్ కేంద్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. భారీ ఫీజులు వసూలు చేసే కోచింగ్ సంస్థలు విస్తరించడంతో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నీట్ వ్యవస్థ సమాన అవకాశాలను దూరం చేస్తోందని తమిళనాడు ప్రభుత్వం అభిప్రాయపడింది. పరీక్షకు ప్రత్యేక శిక్షణ పొందగలిగే ఆర్థిక స్థోమత ఉన్నవారికి, అలాంటి సౌకర్యాలు లేని విద్యార్థులకు మధ్య అంతరం పెరుగుతోందని వాదించింది.నీట్ విధానం సామాజిక న్యాయం, సమానత్వం, రాష్ట్రాల విద్యా హక్కులకు విరుద్ధంగా ఉందన్న తమిళనాడులోని వరుస ప్రభుత్వాల వాదనను కూడా మంత్రి ప్రస్తావించారు. రాష్ట్రంలో వైద్య విద్య ప్రవేశాలను విద్యార్థుల 12వ తరగతి మార్కుల ఆధారంగా నిర్వహించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. గతంలో డీఎంకే ప్రభుత్వం కూడా ఇదే విధానాన్ని సూచించింది.నీట్‌కు సంబంధించిన వివాదాల్లో పేపర్ లీక్ ఆరోపణలను కూడా తాజా తీర్మానంలో తమిళనాడు ప్రభుత్వం ప్రస్తావించింది. పరీక్షా విధానంతో విద్యార్థులపై తీవ్రమైన మానసిక ఒత్తిడి ఏర్పడుతోందని, ఆ ఒత్తిడి కారణంగా విద్యార్థుల ఆత్మహత్యలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. నీట్‌ను రద్దు చేయడం ద్వారా ఇలాంటి పరిస్థితులకు ముగింపు పలకవచ్చని ప్రభుత్వం పేర్కొంది.దీంతో వైద్య విద్య ప్రవేశాలపై కేంద్రం, రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న విభేదాలు మరోసారి తమిళనాడు అసెంబ్లీ వేదికగా బయటపడ్డాయి. రాష్ట్ర హక్కులు, సామాజిక సమానత్వం, విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి వంటి అంశాలను ముందుకు తెస్తూ నీట్‌ను వ్యతిరేకిస్తున్న తమిళనాడు వైఖరి తాజాగా కూడా కొనసాగింది.

# గరిబోళ్ళ బిడ్డ... గడ్డం వినోదన్న!

గడ్డం వినోద్ తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు. ఆయన రాజకీయ ప్రస్థానం, సామాజిక సేవ, క్రీడలు, పలు కీలక రంగాల సమ్మేళనమని స్పష్టంగా చెప్పవచ్చు. ఒకవైపు మాజీ కేంద్ర మంత్రి, ఆలిండియా స్థాయి దళిత జాతి రత్నం, గడ్డం వెంకటస్వామి వారసత్వాన్ని కొనసాగిస్తూనే, మరోవైపు తనదైన రాజకీయ శైలిని నిర్మించుకుంటూ ముందుకు కదులుతున్నారు. ఎన్నో విజయాలు, పరాజయాలు చూసినా రాజకీయాల్లో ప్రజాసేవ నుంచి వెనక్కి తగ్గకుండా ముందడుగు వేస్తున్న నాయకుడు. ప్రజా సేవయే పరమావధిగా కొనసాగడం గడ్డం వినోద్ ఆయన ప్రత్యేకత.

1956 సెప్టెంబర్ 16న జన్మించిన వినోద్ హైదరాబాద్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేసి, నిజాం కళాశాల నుంచి బి.కాం పట్టా పొందారు. చదువు పూర్తయ్యాక వ్యాపార రంగంలో అడుగుపెట్టి పొగాకు, సిమెంట్ పరిశ్రమల్లో విజయవంతమైన వ్యాపారవేత్తగా గుర్తింపు పొందారు. రాజకీయాల్లోకి రాకముందే ఆయన క్రీడా రంగంలోనూ విశేష సేవలందించారు. ముఖ్యంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసి రాష్ట్ర క్రికెట్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. 1999లో చెన్నూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. తొలి ప్రయత్నంలో ఇబ్బంది ఎదురైనా, అక్కడి ప్రజలతో అనుబంధాన్ని కొనసాగించారు. నమ్ముకున్న ప్రజలకు ప్రజాసేవనే చేస్తూ వచ్చారు. అయితే, 2004లో అదే నియోజకవర్గం నుంచి ఘన విజయం సాధించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో అడుగుపెట్టారు. అనంతరం ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో కార్మిక, జౌళి శాఖల మంత్రిగా పనిచేశారు. కార్మిక సంక్షేమం, పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణకు చర్యలు చేపట్టారు. అటు తర్వాత కూడా రాజకీయంగా చురుకుగానే కొనసాగారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బెల్లంపల్లి నుంచి పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్యపై భారీ మెజారిటీతో విజయం సాధించారు. దాదాపు 58 శాతం ఓట్లను సాధించి అసెంబ్లీలోకి మళ్లీ ప్రవేశంచి గడ్డం వినోద్ చరిత్ర సృష్టించారంటే అతిశయోక్తి కాదు. ఈ విజయం ఆయన రాజకీయ జీవితంలో కీలక మలుపుగా నిలిచింది. కాగా, ప్రస్తుతం బెల్లంపల్లి ఎమ్మెల్యేగా గనుల కార్మికుల సంక్షేమం, రహదారులు, తాగునీరు, వైద్య సదుపాయాలు, గృహనిర్మాణం, పారిశ్రామికాభివృద్ధి వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా సింగరేణి ప్రాంత ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తూ వారి తరఫున గళం వినిపిస్తున్నారు. గతంలో ఆయన మంత్రి హోదాలో ఆయన కార్మిక సంక్షేమం, పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికుల నమోదు కార్యక్రమాలను వేగవంతం చేయడం, కార్మిక సంక్షేమ బోర్డులను చురుకుగా మార్చడం, కనీస వేతనాల అమలుపై దృష్టి పెట్టడం, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుకు చర్యలు తీసుకోవడం ఆయన హయాంలో జరిగిన ముఖ్యమైన కార్యక్రమాలు చరిత్రలో నమోదై ఉన్నాయి. ఇక జౌళి శాఖ మంత్రిగా సిరిసిల్ల, పోచంపల్లి, గద్వాల వంటి చేనేత ప్రాంతాల అభివృద్ధికి కూడా కృషి చేశారు.

## వినోదన్న గళం.... కార్మికుల పక్షం

మంచిర్యాల జిల్లాలో ఉన్న పలు రకాల కార్మికుల కోసం ఆయన ఎన్నో వేదికల్లో మాట్లాడుతూ వస్తున్నారు. కార్మికులు అదానీ, అంబానీలతో కాదు, అవసరమైతే ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కూడా మాట్లాడే సత్తా ఉందని ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. కాకా కుటుంబం దశాబ్దాలుగా కార్మికులతో కలిసి పని చేస్తోందని, కార్మికుల హక్కుల కోసం ఎప్పుడూ అండగా ఉంటామని వివరిస్తున్నారు. ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసి వేలాది మందికి ఉపాధి కల్పించడమే కాకుండా, కార్మిక సంక్షేమం తమ కుటుంబానికి రాజకీయ అంశం మాత్రమే కాక బాధ్యతని ఆయన ప్రత్యేకంగా వివరిస్తున్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యేగా శాసనసభలో మాట్లాడిన వినోద్, నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. తాగునీటి సమస్యలు, మురుగు కాలువలు, దెబ్బతిన్న రహదారులు, వెనుకబడిన మండలాల అభివృద్ధి, 100 పడకల ఆసుపత్రికి పూర్తి స్థాయి సిబ్బంది నియామకం వంటి అంశాలను ప్రస్తావించారు. ఎల్లంపల్లి నుంచి మందమర్రి, బెల్లంపల్లి పట్టణాలకు గతంలో వేసిన పైపులైన్లను పునరుద్ధరించాలని కూడా కోరారు. ప్రజలకు మెరుగైన వైద్యం, మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. నేటి తెలంగాణ రాజకీయాల్లో గడ్డం వినోద్ అనుభవజ్ఞుడైన కాంగ్రెస్ నేతగా, దళిత వర్గాల గొంతుకగా, అభివృద్ధి రాజకీయాలను విశ్వసించే నాయకుడిగా గుర్తింపు పొందుతున్నారు. వ్యాపార అనుభవం, పరిపాలనా నైపుణ్యం, రాజకీయ అనుభవం కలగలిసి ఆయనను రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానంలో నిలబెట్టాయి. ఆయన





ప్రస్థానం చూస్తే రాజకీయాల్లో ఓటమి అంతిమం కాదని, ప్రజలతో నిరంతర అనుబంధమే నాయకుడి అసలు బలం అనే విషయం స్పష్టమవుతుంది.

## కార్మిక సంక్షేమానికి వినోదన్న సరికొత్త దిశ

2004 వైఎస్ఆర్ ప్రభుత్వంలో గడ్డం వినోద్ మంత్రి అయిన తర్వాత మొదట ప్రాధాన్యం ఇచ్చిన అంశం అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం. ప్రభుత్వ ఉద్యోగులకు, పెద్ద పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కొంతమేర సామాజిక భద్రత ఉన్నప్పటికీ, భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, రిక్షా కార్మికులు, ఆటో డ్రైవర్లు, వ్యవసాయ కూలీలు, బీడీ కార్మికులు, గృహ కార్మికులు, రాతి క్వారీల కార్మికులు, చేతివృత్తులపై ఆధారపడిన లక్షలాది మంది ఎటువంటి సామాజిక భద్రత లేకుండా జీవిస్తున్నారని ఆయన గుర్తించారు. వారి కోసం ఎంతగానో కృషి చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అసంఘటిత కార్మికుల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. నమోదు చేసుకున్న కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కార్మిక సంక్షేమ బోర్డులను చురుకుగా పనిచేయించారు.

## సబ్బండవర్ణాల కోసం సమరం చేసే సౌమ్యుడు

గడ్డం వినోద్ హయాంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. ఈ బోర్డు ద్వారా ప్రమాదంలో కార్మికుడికి సంభవించిన మరణానికి పరిహారం, సహజ మరణానికి ఆర్థిక సాయం, శాశ్వత వికలాంగత్వానికి పరిహారం, పిల్లల విద్యా సహాయం, బాలికల వివాహానికి ఆర్థిక సాయం, ప్రసూతి ప్రయోజనాలు, వైద్య సహాయం, అంత్యక్రియల ఖర్చులకు ఆర్థిక సహాయం వంటి పథకాల అమలును వేగవంతం చేశారు. వారికి కనీస వేతనాల అమలు చేశారు. ఆయన కార్మిక శాఖ మంత్రిగా ఉన్న హయాంలోనే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రైవేట్ పరిశ్రమలు, హోటళ్లు, దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కాంట్రాక్టు సంస్థల్లో కనీస వేతనాలు అమలవుతున్నాయా లేదా అన్నదానిపై జిల్లా స్థాయిలో తనిఖీలు జరిగి కార్మికులకు ప్రత్యేక లబ్ధి జరిగింది. చాలా చోట్ల కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు చెల్లించకపోవడంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### పరిశ్రమల్లో కార్మిక భద్రత




కర్మాగారాల్లో ప్రమాదాలు తగ్గించేందుకు ఫాక్టరీస్ చట్టం అమలుపై గడ్డం వినోద్ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. పరిశ్రమల్లో భద్రతా పరికరాలు, అగ్నిమాపక ఏర్పాట్లు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, కార్మికులకు రక్షణ పరికరాలు, ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా ఉండేలా తనిఖీలు నిర్వహించారు. కార్మిక వివాదాల పరిష్కారం ఆయన విధానం పూర్తిగా చర్చల ఆధారంగా ఉండేది. యాజమాన్యాలు, కార్మిక సంఘాలు మధ్య వివాదాలు తలెత్తినప్పుడు వెంటనే చర్చలు నిర్వహించి సమ్మెలు, లాకౌట్లు జరగకుండా ప్రయత్నించారు. ఈ విధానం వల్ల అనేక పరిశ్రమల్లో ఉత్పత్తి అంతరాయం తగ్గింది. పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఆయన తరచూ చెప్పిన అంశం: కార్మికులకు న్యాయం జరగాలి... అదే సమయంలో పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందాలంటూ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ దృక్పథంతో పెట్టుబడిదారులు, కార్మిక సంఘాల మధ్య సమతుల్యత పాటించే విధానాన్ని అనుసరించారు.

## కార్మికుల వెల్ఫేర్ బోర్డు_ _ _ 'ఉపాధి' ఆఫీసుల ఆధునీకరణ

జిల్లా ఉపాధి కార్యాలయాలను ప్రజలకు మరింత ఉపయోగపడేలా మార్చేందుకు కార్మిక శాఖ మంత్రిగా గడ్డం వినోద్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఉద్యోగార్థుల నమోదు ప్రక్రియ సులభతరం చేశారు. ఉద్యోగ సమాచారాన్ని వేగంగా అందించే విధానం అమలు చేశారు. ప్రైవేట్ కంపెనీలతో అనుసంధానం పెంచారు. నైపుణ్యాభివృద్ధి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలపై యువతకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఐటీఐలు, ఉపాధి శిక్షణా కేంద్రాల ద్వారా వెల్డింగ్, ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, మెషినిస్ట్, కంప్యూటర్ నైపుణ్యాలు వంటి కోర్సులకు ప్రాధాన్యం పెంచారు. ఉద్యోగ మేళాలు ఆయన హయాంలో పలు జిల్లాల్లో ఉద్యోగ మేళాలు నిర్వహించారు. ప్రైవేట్ పరిశ్రమలు, కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రయత్నం చేశారు.

## చేనేత రంగానికి అండ

జౌళి శాఖ మంత్రిగా చేనేత కార్మికుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ప్రత్యేకంగా సిరిసిల్ల, పోచంపల్లి, గద్వాల, నారాయణపేట, ధర్మవరం ప్రాంతాల చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. చేనేత సహకార సంఘాలు, చేనేత సహకార సంఘాలకు, మార్కెటింగ్ సౌకర్యాలు, ప్రభుత్వ కొనుగోళ్లు, ప్రదర్శనలు, ముడిసరుకు సరఫరా, ఆర్థిక సహాయం వంటి అంశాలపై చర్యలు చేపట్టారు. చేనేత వస్త్రాలను ప్రభుత్వ శాఖలు కొనుగోలు చేయాలని సూచించారు. పాఠశాల యూనిఫాంలు, ప్రభుత్వ అవసరాల్లో చేనేతకు అవకాశాలు పెంచే అంశాన్ని ముందుకు తీసుకువచ్చారు. మహిళా కార్మికుల సంక్షేమ కార్యక్రమాలను వేగంగా అమలు చేశారు. మహిళా కార్మికులకు ప్రసూతి సెలవులు, ఆరోగ్య రక్షణ, పని ప్రదేశాల్లో సౌకర్యాలు సమాన వేతనం అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

## బాల కార్మికుల నిర్మూలన

కార్మిక శాఖ ద్వారా బాల కార్మికులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ప్రమాదకర పరిశ్రమల్లో పిల్లలు పనిచేయకుండా చర్యలు తీసుకున్నారు. మంత్రిగా గడ్డం వినోద్ కృషి వల్లనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో బాల కార్మికుల నిర్మూలన పెద్ద ఎత్తున జరిగిందని స్పష్టంగా చెప్పవచ్చు.

సింగరేణి కార్మికుల సమస్యలు

చెన్నూరు, బెల్లంపల్లి, మందమర్రి, రామకృష్ణాపూర్ ప్రాంతాలకు చెందిన సింగరేణి కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆరోగ్యం, నివాసాలు, వైద్య సదుపాయాలు, భద్రత, కుటుంబ సంక్షేమం అంశాలపై అనేక సమావేశాలు నిర్వహించారు.

## నియోజకవర్గ అభివృద్ధి

చెన్నూరు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గ్రామీణ రహదారులు, తాగునీటి పథకాలు, ప్రభుత్వ పాఠశాలలు వసతి గృహాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, విద్యుత్ సదుపాయాలు, ఎస్సీ కాలనీల అభివృద్ధి వంటి పనులకు నిధులు తీసుకొచ్చారు.

## దళిత సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

తన తండ్రి కాకా వెంకటస్వామి ప్రభావంతో గడ్డం వినోద్ కుమార్ దళితుల విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారతపై నిరంతరం మాట్లాడేవారు. ప్రభుత్వ శాఖల్లో రిజర్వేషన్ల అమలు, ఎస్సీ విద్యార్థులకు అవకాశాల విస్తరణ, దళిత యువతకు నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలను ప్రోత్సహించారు.

2004–2009 కాలంలో రాష్ట్రంలో పారిశ్రామికీకరణ వేగంగా సాగుతున్న సమయంలో కార్మిక హక్కులు దెబ్బతినకుండా, పెట్టుబడులకు ఆటంకం కలగకుండా సమతుల్య విధానాన్ని అనుసరించడం ఆయన పదవీకాలం ప్రత్యేకతగా చెప్పబడుతుంది.

భారీ ప్రాజెక్టుల కంటే కార్మిక సంక్షేమ వ్యవస్థను బలోపేతం చేయడం, అసంఘటిత రంగానికి సామాజిక భద్రత కల్పించడం, చేనేత రంగానికి అండగా నిలవడం, ఉపాధి అవకాశాల విస్తరణకు కృషి చేయడం వంటి అంశాలే ఆయన మంత్రిత్వ కాలానికి ప్రధాన గుర్తింపుగా నిలిచాయి.

సాగర్ వనపర్తి, పొలిటికల్ అనలిస్ట్



సాగర్ వనపర్తి, పొలిటికల్ అనలిస్ట్

# రాహుల్ గాంధీ దేశ ప్రజలకి క్షమాపణ చెప్పాలి

జార్ఖండ్ రాష్ట్రంలో విద్యార్థులు ఆ రాష్ట్రంలో ప్రశ్నాపత్రాల లీకేజీ, ఉద్యోగాలు అమ్ముకోవటం పై జూలై 25 వ తారీకు నుండి శాంతియుతంగా నిరసనలు చేస్తుంటే వారిపై కాంగ్రెస్, జెఎంఎం సంకీర్ణ ప్రభుత్వం అమానుషంగా లాఠీ చార్జ్ చేయటం బాష్ప వాయువు పేల్చడం దుర్మార్గమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ విమర్శించారు. ఆ రాష్ట్ర యువత అడుగుతుంది పేపర్ లీకైన పరీక్షలను రద్దు చేయమని, మరలా కొత్తగా నిర్వహించమని, అవకతవకలపై సిబిఐ విచారణ చేయాలని మాత్రమే కోరుతున్నారు కనీసం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి అయిన హేమంత్ సోరేన్ గారి రాజీనామా కూడా కోరటం లేదు. ఎక్కడ ఆ ఉద్యమంలో దేశాన్ని దూషించటం లేదు దేశానికి పహారా కాస్తున్న సైన్యాన్ని విమర్శించడం లేదు హైందవ ధర్మాన్ని హేళన చేయడం లేదు దేశ వ్యతిరేక నినాదాలు చేయకుండా అత్యంత బాధ్యతాయుతంగా నిరసన దీక్ష విద్యార్థులు చేస్తుంటే వారిపై పోలీసులతో కాంగ్రెస్ ప్రభుత్వం దాడి చేయించింది.

జంతర్ మంతర్ లో విద్యార్థులు తరఫున గలాన్ని విప్పున రాహుల్ గాంధీ గారి గొంతు జార్ఖండ్ రాష్ట్రంలో వారి సొంత ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గం పై ఎందుకు మూగపోయింది..??

జంతర్ మంతర్ లో విద్యార్థుల ముసుగులో అనేక అరాచక శక్తులు చొరబడి పోలీసులపై దాడులు చేసి రాళ్లు విసిరి 200 పైగా పోలీసులకి గాయాలు అయ్యాయని అయినప్పటికీ రాహుల్ గాంధీ నేతృత్వంలోని విపక్షాలు ఆ అల్లరి మూకలకి మద్దతుగా నిలబడటం దేశం మొత్తం చూసింది.

ఈరోజు జార్ఖండ్లో విద్యార్థులు పోలీసులపై ఎటువంటి దాడులు చేయలేదు శాంతియుతంగానే తమ నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ వారిపై రాహుల్ గాంధీ ప్రభుత్వ పోలీసులు దుశ్చర్యకి పాల్పడ్డారు. విద్యార్థుల ఉద్యమం అంటే ఎంత ఉన్నతంగా ఉంటుందో ఈరోజు జార్ఖండ్లో మనం చూస్తున్నాం. జంతర్ మంతర్లు విద్యార్థుల ఉద్యమానికి మద్దతు పలికిన ప్రకాష్ రాజ్, సోనాక్షి సిన్హా, వరుణ్ ధావన్, రితేష్ దేశ్ముఖ్, షబానా అజ్మీ వంటి అనేకమంది మేధావులు ఈరోజు రాంచీలో విద్యార్థులపై జరుగుతున్న ధమనకాండపై ఎందుకు నోరు మెదపడం లేదు..??

జంతర్ మంతర్ ధర్నాలు విద్యార్థులకు ఉచితంగా పిజ్జాలు బర్గర్లు, బిర్యానీలు దేశ విదేశాల నుండి స్విగ్గి జొమాటాల ద్వారా ఆర్డర్ అందటం చూసాం అలాగే జునైద్ వంటి వ్యక్తులు మూడు పూటలా భోజనాన్ని అందించడం చూశాం. ఈ డబ్బు ఎవరిచ్చారు, ఎవరు దీనికి సహకరిస్తున్నారు ఇప్పటివరకు ఎవరికీ తెలియదు. కానీ జార్ఖండ్ లో జరుగుతున్న యువత ఉద్యమంలో ఎక్కడ ఇటువంటివి లేవు. వారి భోజనాన్ని వారి తెచ్చుకుంటున్నారు పైపెచ్చు దేశ వ్యతిరేక నినాదాలు చేసిన వారిని తన్ని తరిమేస్తున్నారు. అందుకే దేశం మొత్తం ఝార్ఖండ్ యువత దీక్షకి జేజేలు పలుకుతున్నారు.

జంతర్ మంతర్ లో విద్యార్థుల సమస్యకి మద్దతు పలికి పార్లమెంట్ ని స్తంభింప చేస్తున్న రాహుల్ గాంధీ గారు ఝార్ఖండ్ విద్యార్థుల గురించి నోరు మెదపరే, బెంగళూరు విద్యార్థుల గురించి మాట్లాడరే, పంజాబ్ లో విద్యార్థులకు జరుగుతున్న అన్యాయంపై పెదవి విపరీ..?? అంటే దీనిబట్టి రాహుల్ గాంధీ గారికి విద్యార్థుల సమస్య కన్నా తన రాజకీయ ప్రయోజనాలే మిన్న అన్నది సుస్పష్టం అవుతోంది.

ఏదో ఒక కారణంతో పార్లమెంట్ ని అడ్డుకోటమే ఆయన ధ్యేయం. ప్రజాస్వామ్య వ్యవస్థలని అపహాస్యం చేస్తున్న రాహుల్ గాంధీ గారు దేశ ప్రజలకి క్షమాపణ చెప్పాలి రవి కిరణ్ డిమాండ్ చేశారు.




పెద్దిరెడ్డి రవికిరణ్,
బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్ర ప్రదేశ్

# లైన్ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో గ్రామాల సమగ్ర అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు

- **ప్రతి గ్రామానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ఉండాలి – GP SAP, GPDP, BPDP, DPDPలను సమర్థవంతంగా రూపొందించాలి**
- **జలశ్రీ కింద నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత**
- **వనమహోత్సవం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి**
- **అధికారులతో సమన్వయ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కె. కిరణ్మయి**

**రంగారెడ్డి జిల్లా వెలుతురు ఆగస్టు 11:**





గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కేవలం ఒక శాఖ బాధ్యత కాదని, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా అదనపు కలెక్టర్ కె. కిరణ్మయి అన్నారు. ప్రతి గ్రామానికి ఉన్న వాస్తవ అవసరాలను గుర్తించి, వివిధ శాఖల పథకాలు, నిధులు, మానవ వనరులను సమర్థవంతంగా అనుసంధానం చేసి ఫలితాలు సాధించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల ఇంజినీరింగ్ అధికారులు, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో జలశ్రీ, GP SAP, 2026–27 GPDP, BPDP, DPDP, వనమహోత్సవం, పారిశుధ్యం, శాఖల కన్వర్జెన్స్ తదితర అంశాలను అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ప్రతి గ్రామానికి ఒక స్పష్టమైన అభివృద్ధి దిశ ఉండాలి. ఏ గ్రామంలో ఏ సమస్య ఉంది, దానికి ఏ శాఖ ద్వారా పరిష్కారం చూపవచ్చు, ఏ పథకం కింద నిధులు సమకూర్చవచ్చు, ఎప్పుడు పని పూర్తి చేయవచ్చు అనే అంశాలపై అధికారులు స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలి" అని సూచించారు. ప్రతి శాఖ తన కార్యక్రమాలను గ్రామ అభివృద్ధి ప్రణాళికతో అనుసంధానం చేయాలి .గ్రామ పంచాయతీ స్థాయిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ఒక్కో శాఖకు పరిమితం కాకుండా, అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ల కార్యక్రమాలను ఒకే సమగ్ర ప్రణాళికలోకి తీసుకురావాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. "ఒకే గ్రామంలో వివిధ శాఖలు వేర్వేరుగా పనులు చేపట్టకుండా, పరస్పరం సమాచారాన్ని పంచుకొని ఒకే లక్ష్యంతో పనిచేయాలి. ఒక శాఖకు ఉన్న వనరులను మరో శాఖ కార్యక్రమంతో అనుసంధానం చేసి, ప్రభుత్వ నిధులను గరిష్ఠంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా వినియోగించాలి" అని అధికారులకు సూచించారు. గ్రామస్థాయిలో ఉన్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటిని ప్రాధాన్యతా క్రమంలో నమోదు చేసి, సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించాలని అన్నారు.

### GP SAP ప్రతి గ్రామానికి అభివృద్ధి సమాచార పత్రంగా ఉండాలి

ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఒకే చోట అందుబాటులో ఉంచే విధంగా GP SAP – Gram Panchayat Samagra Abhivrudhi Pranalikaను రూపొందించాలని ఆదేశించారు. గ్రామంలోని జనాభా, మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సంక్షేమం, నీటి వనరులు, పర్యావరణం తదితర అంశాలకు సంబంధించిన వివరాలను సమగ్రంగా పొందుపరచాలని సూచించారు. "ప్రతి గ్రామానికి ఒక సమగ్ర బుక్‌లెట్ ఉండాలి. ఆ గ్రామంలో ఏముంది, ఏమి అవసరం, ఇప్పటికే ఏ కార్యక్రమాలు అమలవుతున్నాయి, ఇంకా ఏ పనులు చేపట్టాలి అనే పూర్తి సమాచారం అధికారుల చేతిలో ఉండాలి. అదే గ్రామ అభివృద్ధికి ప్రాథమిక పత్రంగా ఉపయోగపడాలి" అని ఆమె తెలిపారు.

### 2026–27 GPDPలో అన్ని శాఖల కార్యక్రమాలు ప్రతిబింబించాలి

2026–27 సంవత్సరానికి రూపొందించే గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (GPDP)లో అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ల కార్యక్రమాలు, పథకాలు, నిధులను సమన్వయం చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సభలు, క్షేత్రస్థాయి పరిశీలనలు, ప్రజల అవసరాల ఆధారంగా ప్రాధాన్యతా పనులను గుర్తించి GPDPలో చేర్చాలని సూచించారు. గ్రామ స్థాయి ప్రణాళిక మండల స్థాయి BPDP, జిల్లా స్థాయి DPDPతో అనుసంధానమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. "GPDP కేవలం ఒక పత్రంగా తయారై ఫైల్‌లో ఉండకూడదు. అందులో పేర్కొన్న పనులు భూమిపై కనిపించాలి. ప్రణాళిక నుంచి అమలు వరకు ప్రతి దశలో అధికారులు బాధ్యత వహించాలి" అని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.

### జలశ్రీ కింద నీటి సంరక్షణకు ప్రాధాన్యత

వర్షపు నీటిని సంరక్షించడం, భూగర్భ జలాలను పెంపొందించడం, గ్రామాల్లో నీటి లభ్యతను మెరుగుపరచడం కోసం జలశ్రీ కార్యక్రమం కింద ఫార్మ్ పాండ్స్, సోక్ పిట్స్, పెర్కొలేషన్ ట్యాంకులు తదితర నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో నీటి సంరక్షణకు అనువైన ప్రాంతాలను గుర్తించి, అవసరానికి అనుగుణంగా పనులను చేపట్టాలని సూచించారు. అందుబాటులో ఉన్న వివిధ ప్రభుత్వ పథకాలు, నిధులను కన్వర్జెన్స్ విధానంలో వినియోగించాలని అన్నారు. "వర్షపు నీటిలో ఒక్క చుక్క కూడా వృథా కాకుండా సంరక్షించే విధంగా గ్రామస్థాయిలో శాశ్వత నిర్మాణాలను ప్రోత్సహించాలి. నీటి సంరక్షణ పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ఆస్తులుగా నిలిచేలా ప్రణాళిక రూపొందించాలి" అని అధికారులకు సూచించారు. వనమహోత్సవంలో మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా మొక్కలు నాటే కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ తెలిపారు. మొక్కలు నాటడం మాత్రమే లక్ష్యంగా కాకుండా, వాటి సంరక్షణకు స్పష్టమైన బాధ్యతను సంబంధిత శాఖలకు అప్పగించాలని సూచించారు. నాటిన మొక్కలకు నీటి సదుపాయం, రక్షణ, నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి శాఖ తన పరిధిలో నాటిన మొక్కల వివరాలను నమోదు చేసుకొని, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

### గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

సీజనల్ వ్యాధుల వ్యాప్తికి అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మురుగు కాలువలు, నీటి నిల్వలు, చెత్త పేరుకుపోయే ప్రాంతాలు, ప్రజా ప్రదేశాలను గుర్తించి శుభ్రపరచాలని సూచించారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు, తాగునీటి వనరుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. "పారిశుధ్యం అనేది కేవలం ఒక రోజు కార్యక్రమం కాకూడదు. గ్రామాల్లో నిరంతర పారిశుధ్య వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన గ్రామాలను నిర్మించాలి" అని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులను ఆదేశించారు.

### క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా సమన్వయంతో పనిచేయాలి

ప్రతి శాఖ తమకు కేటాయించిన కార్యక్రమాలను సమయపాలనతో పూర్తి చేయడంతో పాటు, ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని "కన్వర్జెన్స్ ద్వారా గరిష్ఠ ఫలితాలు – ప్రజలకు గరిష్ఠ ప్రయోజనం" అనే లక్ష్యంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ కె. కిరణ్మయి సూచించారు. అధికారులు క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలించాలని, ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ZPCEO/DRDO, కృష్ణారెడ్డి, DPO సురేష్ మోహన్, పంచాయతీరాజ్, RWS, R&B, ఇరిగేషన్ శాఖల EEలు, DWO, సంక్షేమ శాఖల అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, సివిల్ సప్లయ్ అధికారులు వనజాత, హరీష్, DM&HO స్వర్ణకుమారి, MPDOలు, MPOలు, APOలు, APMలు, Dy.EEలు తదితర జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఆరుట్ల గ్రామంలో శ్రీ మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ ఆధ్వర్యంలో కాం గ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు

- **నుకం బాలరాజు ముదిరాజ్ రాజకీయంగా ఇంకా ఎదిగి ప్రజాప్రతినిధి కావాలి**
- **మహాలక్ష్మి సిండికేట్ అధ్యక్షుడు అంతటి రాజు గౌడ్, వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్**

**మంచాల వెలుతురు ఆగస్టు 11:**



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో సోమవారం రాత్రి శ్రీ మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ అధ్యక్షు డు అంతటి రాజుగౌడ్ ఆధ్వర్యం లోమహాలక్ష్మి గ్రూప్ సభ్యుడు కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్య క్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి శాలువలతో ఘనంగాసన్మా నించారు జన్మదిన వేడుకలకు హాజరైన వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ మాట్లాడుతూ బా లరాజు ముదిరాజ్ గ్రామంలో అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఎవ్వరికి ఎలాంటి ఆపదవ చ్చిన నేను ఉన్నాను అంటూ భరోసా ఇచ్చే గొప్ప వ్యక్తి గొప్పనాయకుడు బాలరాజు ముదిరాజ్ అన్నారు రాజకీయకంగా ఎదిగి ప్రజాప్రతినిధి హోదాలో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని కో రుకున్నారు ఈ కార్యక్రమంలో శ్రీ మహాల క్ష్మి గ్రూప్ సభ్యులు పల్లె శ్రీనివాస్ గౌడ్ నూతనగంటి కృ ష్ణ మాడపాకుల యాదగిరి తవిటి నరసింహ ముదిరాజ్ ఆమంచ సంతోష్ అంతటి కృష్ణ గౌడ్ ఎన్నుదుల రాకేష్ మాడపాకుల కృష్ణ పాల్గొన్నారు.

## అద్వానంగా గజ్వేల్ జాలిగామ బైపాస్ రోడ్డు

- **బిజెపి మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్**

**గజ్వేల్ వెలుతురు ఆగస్టు 11:**



సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పట్టణం నుంచి రామాయంపేట వెళ్లే జాలిగామ బైపాస్ రోడ్డు సంపూర్ణంగా గుంతలమయంగా మారి, వాహనదారులకు నరకప్రాయంగా తయారైందని గజ్వేల్ మండల బిజెపి అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ కీలక బైపాస్ రోడ్డులో పెద్ద ఎత్తున గుంతలు పడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రయాణికులు తీవ్ర భయాందోళనల మధ్య ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొన్నారు. గతంలో వార్తాపత్రికలలో ఈ రహదారి దుస్థితిపై విస్తృతంగా కథనాలు ప్రచురితమైనప్పటికీ, సంబంధిత అధికారులు, పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు మొద్దు నిద్ర వీడి, వెంటనే స్పందించి జాలిగామ బైపాస్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల తరఫున బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దాతర్ పల్లి సర్పంచ్ రాజు మండల ప్రధాన కార్యదర్శిలు ఇప్ప స్వామి, బార్ అరవింద్, మండల ఉపాధ్యక్షులు శాతం స్వామి, మండల సీనియర్ నాయకులు కర్నూలు శ్రీనివాస్, గణపతి, మహేష్ చారి, నరేష్, బీజేవైఎం నాయకులు అనిల్, సోషల్ మీడియా కన్వీనర్ జీడిపల్లి మధు కర్ణాకర్, మహేందర్, గణేష్, కుమార్, నగేష్, పాల్గొన్నారు.

## ఆరుట్లలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బాలరాజ్ జన్మదిన వేడుకలు

- **బాలరాజ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**

**మంచాల వెలుతురు ఆగస్టు11:**



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ జన్మదిన వేడుకల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో బాలరాజ్ ముదిరాజ్ యూత్ కాంగ్రెస్ నాయకుడు పంబాల జీవన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీరాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి గారు గ్రామశాఖ అధ్యక్షుడునూ కం బాలరాజ్ ముదిరాజ్ ను కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి శాలువాతో ఘనం గా సన్మానించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు అలాగే యువజన కాంగ్రెస్ నాయకుడు పంబాల జీవన్ ను శాలువతో ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బుడిగల పరమేష్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ ముదిరా జ్ కంబాలపల్లి బుగ్గరాములు మార లక్ష్మణ్ కోరే బాబు కాంగ్రెస్ పార్టీ నాయకులు రావుల భాష కావలి శ్రీనివాస్ ముదిరాజ్ (హోటల్) గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ మాజీ కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ సలాం అంతటి రాజుగౌడ్ దాసరమోని రమేష్ ముదిరాజ్ బుట్టి జంగయ్య ముదిరా జ్ తలారి కృష్ణ ముదిరాజ్ మర సురేష్ మనిపాటి వెంకటేష్ చెనమోని శంకర్ ముదిరాజ్ మొ ద్దు కిషోర్ రెడ్డి చిందం ఐలయ్య బీర్ మల్లేష్ నుకం మల్లేష్ ముదిరాజ్ రాయుడు ముదిరాజ్ దాసరమోని అశోక్ బత్తుల రాజుగౌడ్ ఆమంచ జగన్ ముదిరాజ్ మహమ్మద్ అష్రఫ్ రైనా ము దిరాజ్ అంతటి కృష్ణ గౌడ్ లచ్చగారి జంగారెడ్డి దూసరి రాజుగౌడ్ అడేపు మధు గొరిగే కృష్ణ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో దాద్‌పల్లిలో సీసీ రోడ్డుకు రూ.25 లక్షలు మంజూరు

- **సిసి రోడ్ నిర్మాణ పనులను ప్రారంభించిన దాద్ పల్లి గ్రామ సర్పంచ్ నేనావత్ శాంతి రాజు నాయక్**

**మంచాల వెలుతురు ఆగస్టు 11:**



మంచాల మండలం దాద్ పల్లి గ్రామంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి నిధులనుంచి సిసీ రోడ్ నిర్మాణంకోసం 25 లక్షల మంజూరు సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన గ్రామసర్పంచ్ నేనావత్ శాంతి రాజునాయక్ ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతు పా ర్టీలకతీతంగా గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయటానికి కృషి చేస్తానని అన్నారు గ్రామానికి కా వాల్సిన మౌలిక సదుపాయాలు అన్ని కాలనిలో రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తిస్థాయిలో అ భివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ప్రభుత్వం నుంచి వచ్చే పెన్షన్లు ఇందిరమ్మ ఇండ్లు నిరుపేద లకు అందేలా కృషి చేస్తా అనిఅన్నారు తెలియజేశారు ఈకార్యక్రమంలో.మంచాల మండలం మాజీ వైస్ ఎంపీపీ నర్సింగ్ వెంకటేష్ గౌడ్ ఉపసర్పంచ్ కావేటి నర్సింగ్ రావు గ్రామపంచాయ తీ వార్డ్ సభ్యులు నేనావత్ పార్వతి నేనావత్ సునీత నీలమ్మ పాలత్యా లక్ష్మణ్ జాటోత్ రమేష్ నాయక్ హీరానాయక్ మందుల మాధవి జాటోత్ హతీరామ్ మాజీ ఉపసర్పంచ్ నర్సింగ్ శేఖర్ గౌడ్ నేనావత్ రాజునాయక్ పాలకుర్ల లక్ష్మయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆషాఢ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ) ఆగస్టు 11:**

షాపూర్ నగర్ వెజిటబుల్ మార్కెట్ కమిటీ వారి ఆధ్వర్యంలో షాపూర్ మార్కెట్ సమీపంలోని నల్ల పోచమ్మ తల్లి ఆలయంలో ఆషాడ బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ హాజరై పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. పోచమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం షాపూర్ మార్కెట్ కమిటీ సభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ని శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు కూన రాఘువేందర్ గౌడ్, కమిటీ సభ్యులు గుమ్మడి వెంకటేష్, షేక్ అజ్జు, రవి, నాని, మరియు జగన్, విజయ్, ప్రభాకర్ రెడ్డి ఆలయ నిర్వాహకులు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు



# చౌటుప్పల్‌లో బీజేపీ కార్యవర్గ సమావేశం.. పలు తీర్మానాలు

- ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపు
- 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంపై దిశానిర్దేశం
- ఎస్ఐఆర్ రెండో దశపై నాయకులకు సూచనలు
- బూత్ కమిటీల బలోపేతంపై ప్రత్యేక దృష్టి
- కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై ఉద్యమాలకు నిర్ణయం
- స్థానిక యువత ఉద్యోగాలపై బీజేపీ ఫోకస్
- రైతు సమస్యలపై పోరాటానికి కార్యాచరణ
- ఫ్లైఓవర్ నిర్మాణంపై ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయం
- వంద పడకల ఆసుపత్రి పనులు పూర్తి చేయాలని డిమాండ్

**పార్టీ సంస్థాగత బలోపేతానికి ప్రణాళిక**

**చౌటుప్పల్ వెలుతురు ఆగస్టు 11:**



చౌటుప్పల్ మున్సిపల్, మండల బీజేపీ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. చౌటుప్పల్‌లోని ఎస్ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతంతో పాటు స్థానిక ప్రజా సమస్యలు, రాజకీయ అంశాలపై పలు తీర్మానాలు చేశారు.దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజలను ప్రోత్సహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎస్ఐఆర్ రెండో దశలో భాగంగా బీఎల్ఏ-2లు, పార్టీ నాయకులు చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమావేశంలో తగిన సూచనలు ఇచ్చారు. అలాగే పార్టీ బూత్ కమిటీలను మరింత బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తరించడం, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసే విధివిధానాలపై చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ నాయకులు ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవసరమైన చోట నిరసనలు, ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించారు. స్థానిక యువతకు ఉద్యోగాలు, రైతుల సమస్యల పరిష్కారం, చౌటుప్పల్ మున్సిపాలి టీలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం వంటి అంశాలపై పోరాటాలు చేపట్టాలని నిర్ణయించారు.అదేవిధంగా చౌటుప్పల్‌లో ప్రతిపాదించిన వంద పడకల ఆసుపత్రి పనులు ఇంకా పూర్తికాకపోవడంపై నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ అంశాలపై రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూడల భిక్షం గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు కడారి కల్పన, ఐలయ్య యాదవ్, రూరల్ అధ్యక్షుడు కైరంకొండ అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు సాగా చంద్రశేఖర్ రెడ్డి, రమణ, గోని శంకరయ్య, ఫ్లోర్ లీడర్ బుడ్డ సురేష్, కౌన్సిలర్లు పోలపల్లి లక్ష్మి, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే సర్పంచులు టేకుల మంజుల, తంగళ్ల వెంకటేశం, నందగిరి వెంకటేశం, మహేంద్ర మణి, కైరంకొండ స్వప్న, అశోక్, ముత్యాల భూపాల్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, ఉబ్బు బిక్షపతి, కడవేరు పాండు, నల్ల అంజయ్య, కంది లక్ష్మారెడ్డి, గడ్డం నరసింహ, బత్తుల జంగయ్య, మండల ప్రధాన కార్యదర్శి యాస అశోక్ రెడ్డి, ఉప సర్పంచులు ఫకీరు శ్రీనివాస్ రెడ్డి, వల్లందాసు మహేష్, బోయ సదానందం, వంగాల రమాకాంత్, బాతరాజు ధనుంజయ, ఊదరి దివ్య, బర్మా నాగరాణి, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవస్థానం కాంట్రాక్టు , ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకుంటాం

- ప్రభుత్వ విప్ , ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**యాదగిరిగుట్ట , ఆగస్టు 11 ( వెలుతురు):**



యాదగిరిగుట్ట దేవస్థానంలో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే ఉద్యోగులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. మంగళవారం యాదగిరిగుట్ట దేవస్థానం కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని యాదగిరిగుట్టలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ , ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానంలో కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. వారి సమస్యలను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి దృష్టికి , ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. సకాలంలో వారికి వేతనాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పనికి తగ్గ వేతనం లభించేలా కృషి చేస్తామని అన్నారు. ఉద్యోగులకు ఆరోగ్యపరమైన ఇతర అన్ని రకాల సౌకర్యాలు అందించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్, బోర్డు సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించేందుకు తగిన విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉద్యోగులంతా తమ కుటుంబ సభ్యులే అని, వారిని ఆదుకునేందుకు వారికి అండగా ఉండేందుకు తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని అన్నారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులంతా ఒకే తాటిపై ఉండాలని గ్రూపులుగా, రెండు మూడు యూనియన్లుగా విడిపోవద్దని కోరారు. కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులంతా ఒకే ఒక యూనియన్ గా ఏకతాటిపై ఉండాలని పిలుపునిచ్చారు. తాను నాయకుడిని కాదని , సేవకుడనని ప్రజల సేవ కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. అంతకుముందు ఆయనకు దేవస్థానం కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు గజమాలతో, బాణాసంచా పేలుళ్లతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ను వారు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు . అనంతరం వారు తమ కోరికలు, డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రభుత్వ విప్ కు అందజేశారు . తమకు వారాంతపు సెలవులు, సిక్ లీవులు ఇవ్వాలని , ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని వారు ప్రభుత్వ విప్ కు వినతి పత్రం అందించారు. ఈ మేరకు వారి కోరికలను, వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు కృషి చేస్తామని వారికి ప్రభుత్వ విప్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దేవస్థానం కాంట్రాక్టు , ఔట్సోర్సింగ్ ఉద్యోగులంతా కలిసి తమకు గౌరవ అధ్యక్షుడిగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుండ్లపల్లి భరత్ గౌడ్ , సాదునేని మధుకర్, ముక్కెర్ల మల్లేష్ యాదవ్ , యాదగిరిగుట్ట దేవస్థానం కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కైరంకొండ అనిల్ , వర్కింగ్ ప్రెసిడెంట్ రాయగిరి వంశీ, ప్రధాన కార్యదర్శి ఆకునూరి నరసింహ, ఉపాధ్యక్షులు చుక్కల మల్లేష్ , బత్తిని శ్రీను, రాజేందర్, బొజ్జ క్రాంతి, కోశాధికారి బబ్బురి నరసింహ, అదనపు అధ్యక్షుడు సుదగాని కృష్ణ, సంఘం నేతలు గంగసాని నిఖిల్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం భక్త మార్కండేయ పద్మశాలి నిత్య అన్నదాన సత్రం కార్యదర్శిగా మధుసూదన్

**కొయ్యలగూడెం వెలుతురు ఆగస్టు 11:**

చౌటుప్పల్ మండలం కొయ్యలగూడానికి చెందిన కొలను మధుసూదన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీశైలంలోని శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి నిత్య అన్నదాన సత్రం కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. హైదరాబాదులోని పద్మశాలీయుల సమాఖ్య కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఇతని ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ, తనను ఈ పదవికి ఎందుకు



ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీశైలం లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామిని సంద ర్శించే పద్మశాలీయులకు భోజనం వసతి కల్పిం చేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

# ఎర్ర నర్సమ్మ మృతి వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 11:**



గ్రామం ఇంద్రపాలనగరం అకాల మరణం చెందిన ఎర్ర నర్సమ్మ మృతుదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేసి 5000/-రూపాయల ఆర్థిక సహాయం అందచేసిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్ఉ పసర్పంచ్ నల్ల జయసుధ స్వామి,వార్డ్ సభ్యులు వడ్లకొండ మల్లేశం, పుట్టల ముత్యాలు,మాజీ ఏఎంసి డైరెక్టర్ మందడి విద్యాసాగర్ రెడ్డి, మంటి లింగస్వామి, ఈర్లపల్లి మల్లయ్య, మాజీ ఉపసర్పంచ్ సింగణబోయిన జంగయ్య, గర్దాస్ సిద్దయ్య,మాజీ ఏఎంసి డైరెక్టర్ గర్దాస్ కరుణాకర్, మందడి శ్రీధర్ రెడ్డి, పాలసంఘము చైర్మన్ కంబాలపల్లి శ్రీశైలం, రాజన్నగారి మురళి, మాజీ వార్డ్ సభ్యులు నిమగడ్డ పద్మారావ్, ఈర్లపల్లి రమేష్, చిన్నపాక సురేష్, నల్ల రామస్వామి, కాటేపల్లి మహేష్, మంటి బిక్షపతి, మాధం నాగేష్,కూకుట్ల సత్తయ్య, నల్ల రమేష్, తంగేడిపెల్లి ఎల్లయ్య, నల్ల చంద్రయ్య, చినలచ్చి శంకరయ్య, బొల్ల మత్స్యగిరి, నల్ల మల్లయ్య, నల్ల మహేష్, వెలిమినేటి నరేష్, భువనగిరి మధు, మట్ట యాదయ్య, సింగణబోయిన మత్స్యగిరి, రాజన్నగారి ఆదిత్య, గర్దాస్ సాయి, గర్దాస్ శ్రీకాంత్, వడ్లకొండ చింటూ, నల్ల గిరిబాబు, భువనగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సోమనాథ క్షేత్రంలో అఖండ మహా మృత్యుంజయ యాగం

**చౌటుప్పల్, వెలుతురు ఆగస్టు 11:**



లోక కళ్యాణం కోసం చౌటుప్పల్ లోని శ్రీ సోమనాథ క్షేత్రంలో అఖండ మహా మృత్యుంజయ యాగం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేదమూర్తులచే శాస్త్రోక్తంగా యాగం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా జీవనం సాగించాలని ఆకాంక్షిస్తూ శ్రీ సోమనాథ మహర్షికి, మహా శివుడికి పూజలు నిర్వహించారు. మహర్షికి హారతి పట్టి భజనలు చేశారు. మనోయోగ సాధన చేసినవారికి ఆయురారోగ్యాలు లభిస్తాయని వివరించారు. హాజరైన భక్తులందరికీ అన్న ప్రసాదం వితరణ చేశారు. శ్రీ సోమనాథ క్షేత్రం చౌటుప్పల కమిటీ అధ్యక్షుడు బడుగు నరసింహ, కార్యనిర్వాహక అధ్యక్షుడు అప్పిడి రామ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు సుభాష్ చారి, కార్యదర్శి గట్టు ప్రభాకర్, కోశాధికారి ఊర కృష్ణమూర్తి భక్తులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలను సాగు చేయాలి - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

- పొలాల్లోకి దిగిన సూర్యాపేట కలెక్టర్
- రైతులతో మాట - పంట మార్పిడికి బాటలో రైతులకు దిశానిర్దేశం

**నూతనకల్/ మద్దిరాల, ఆగస్టు11( వెలుతురు):**



వాతావరణం మారుతోంది నీళ్లు తగ్గుతున్నాయి, అందుకే తక్కువ నీటితో ఎక్కువ లాభం వచ్చే ఆరుతడి పంటల వైపు మళ్లండని సూర్యాపేట జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు. మంగళవారం జిల్లాలో నిర్వహిస్తున్న రైతులతో మాట – పంట మార్పిడికి బాట కార్యక్రమంలో భాగంగా ఆయన ఆత్మకూరు(ఎస్ ),నూతనకల్, మద్దిరాల మండలాల్లో పర్యటించారు. స్వయంగా వ్యవసాయ క్షేత్రాల్లోకి వెళ్లి రైతులతో ముచ్చటించారు.

**జర్బరా సాగు బాగుంది**

ఆత్మకూరు మండలంలోని వీరారెడ్డి, సందీప్ రెడ్డి పొలాల్లో సాగవుతున్న పెసర, బంతి తోటలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తుమ్మలపెనపాడ్ గ్రామంలో రైతు సౌనయ్య సాగు చేస్తున్న 'జర్బరా' పూల పాలీహౌస్‌ను చూసి అభినందించారు. వరికి బదులు ఇలాంటి కొత్త రకం పంటలు వేయడం వల్ల ఆర్థికంగా మంచి లాభాలు ఉంటాయని చెప్పారు. కంది, బొబ్బర్లు, వేరుశనగ, మొక్కజొన్న, జొన్నలు, సజ్జలు, కూరగాయలు పండిస్తే తక్కువ కాలంలోనే చేతికి డబ్బులొస్తాయని వివరించారు.

**అంతర పంటలతో అదనపు ఆదాయం**

మద్దిరాల మండలం పోలుమల్లలో రైతు ఎల్లు వెంకటరెడ్డి ఆయిల్ పామ్ తోటలో అంతర పంటగా పెసర వేయడాన్ని కలెక్టర్ పరిశీలించారు. మిగిలిన భూముల్లో మిర్చి సాగు చేసుకోవాలని సూచించారు. నూతనకల్లు మండలంలో కొండ్ర వెంకటరెడ్డి, వినోద పొలాల్లో పత్తి, కంది అంతర పంటలను చూసి సలహాలిచ్చారు.ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున, రైతులు వరి సాగును తగ్గించుకోవాలని కోరారు.

**ఆయిల్ పామ్ పెంపకమే లక్ష్యం**

జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ఒక ఉద్యమంలా చేపట్టాలని ఉద్యానవన శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా ఆయిల్ పామ్ వేసే రైతులకు పూర్తి సమాచారం అందించాలి. మండలంలో సక్సెస్ అయిన రైతుల విజయగాథలను ఇతరులకు వివరించాలని సూచించారు. పది రోజుల పాటు నిర్వహించే రైతులతో మాట ప్రోగ్రామ్‌ను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న భూములను గుర్తించి, ఆ రైతులను పంట మార్పిడి వైపు మళ్లించాలని ఆదేశించారు. మండలాల్లో విత్తనాలను ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని, క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన, విస్తరణ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, ఆత్మకూరు (యస్) నూతనకల్ మద్దిరాల మండల ప్రత్యేక అధికారులు డి.విశాల్, భారతి, తహసిల్దార్లు అమిన్ సింగ్, శ్రీనివాస్, తబిత, నూతనకల్ ఎంపీడీవో సునిత, వ్యవసాయ అధికారులు సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# పోచమ్మ తల్లి బోనాల పండుగ వైభవంగా

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 11:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝరసంఘం మండల కేంద్రంలో పోచమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రజల ఐకమత్యానికి, ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనమన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలంతా ఐకమత్యంతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొగ్గల సంగమేశ్వర్, మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు జగదీశ్వర్, గ్రామ సర్పంచ్ వినోద్ బాల్



రాజ్, పట్టణ అధ్యక్షుడు ఎజాస్ బాబా, సర్పంచులు నాగేందర్ పటేల్, శివమణి, సోహెల్, మండల నాయకులు వెంకట్ రెడ్డి, శశివర్ధన్ రెడ్డి, ఉప సర్పంచ్ అనిల్, వార్డు సభ్యులు ప్రవీణ్, సంగమేశ్వర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ,ప్రాథమిక పాఠశాల విద్యార్థి పై కోతుల దాడి

**మోత్కూర్, ఆగస్టు 11, వెలుతురు :**



మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో కోతుల బెడద మరోసారి భయాందోళనకు గురిచేసింది. కొండగడపలోని యూపీఎస్ ప్రాథమిక పాఠశాలలో ఐదేళ్ల విద్యార్థి తొంట యశ్వంత్‌పై మంగళవారం కోతులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు.పాఠశాల పరిసరాల్లో ఉన్న సమయంలో కోతు లు విద్యార్థిపై దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన యశ్వంత్‌ను వెంటనే మోత్కూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.కొండగడపలో కోతుల బెడద తీవ్రంగా ఉందని, పాఠశాల పరిసరాల్లోనూ కోతులు సంచరిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యపై గతంలోనే సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల భద్రతకు ముప్పు పొంచి ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు.కోతుల బెడదను తక్షణమే నివారించి, పాఠశాల పరిసరాల్లో చిన్నారులకు రక్షణ కల్పించాలని స్థానికులు డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు.

# కీర్తిశేషులు బోయిని సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థంగా మరుగుదొడ్ల మరమ్మతులు

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 11:**



గ్రామం ఇంద్రపాలనగరం విద్య సంవత్సరంలో 65 మంది నూతన విద్యార్థులు పాఠశాలలో చేరడం తో మరుగుదొడ్లు సరిపోక విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న సర్పంచ్ కీర్తిశేషులు బోయిని సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం

**దాత బోయిన చిన్న మల్లేశం సహకారంతో**

నిరూపయోగంగా ఉన్న మరుగుదొడ్లు మరమ్మతులు కోసం 35000/-రూపాయలు వారి కుటుంబ సభ్యులు సర్పంచ్ ప్రధానోపాధ్యాయులు కి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువనాయకులు ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, సింగణబోయిన గణేష్ యాదవ్, రాస వెంకటేష్,మాజీ ఏఎంసీ డైరెక్టర్ గర్దాస్ కరుణాకర్, నిమ్మగడ్డ పద్మారావ్, మేకల నరేందర్, పాలసంఘము చైర్మన్ కంబాలపల్లి శ్రీశైలం, మాధం నాగేష్, బొల్ల మత్స్యగిరి, వెలిమినేటి నరేష్, భువనగిరి మధు, వడ్లకొండ చింటూ ప్రధానోపాధ్యాయులు శేఖర్, గర్దాస్ సాయి పాల్గొన్నారు.

# నల్ల చెరువులో నల్లతుమ్మ చెట్లను మాయం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- **బిఆర్ఎస్ యాదగిరిగుట్ట పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి డిమాండ్**

**యాదగిరిగుట్ట , ఆగస్టు 11 ( వెలుతురు ) :**



యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని గుండ్లపల్లి నల్ల చెరువులో గత కొన్ని రోజులుగా నల్ల తుమ్మ చెట్లు మాయమవుతున్నాయని, దీని వెనుక ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ యాదగిరిగుట్ట పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి నల్లచెరువులోని తుమ్మ చెట్లు నరికి వేసిన ప్రాంతాన్ని సందర్శించారు . ఈ సందర్భంగా తుమ్మ చెట్లను నరికివేసి తీసుకువెళ్లగా మిగిలిన చెట్ల భాగాలను, మిగిలిపోయి ఉన్న కొన్ని చెట్లను పరిశీలించారు. అనంతరం అక్కడ ఆయన మాట్లాడుతూ నల్ల చెరువులో గత కొన్ని రోజులుగా సుమారు లక్షల రూపాయల విలువైన నల్ల తుమ్మ చెట్లను కొందరు వ్యక్తులు అక్రమంగా అర్ధరాత్రి పూట నరికి తీసుకువెళ్లారని అన్నారు. వారిపై పోలీసులు ఇరిగేషన్ అటవీ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తుమ్మ చెట్లను నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా నరికి తీసుకువెళ్లిన వారిపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వీరి వెనుక ఎవరు ఉన్నారు ? అనే విషయంపై కూడా అధికారులు విచారణ జరిపి వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . సుందరీకరణ పేరుతో ఈ విధంగా అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా నల్ల తుమ్మ చెట్లను నరికి తీసుకువెళ్లడం చట్ట విరుద్ధమని అన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోకపోతే తమ పార్టీ తరపున ఆయా శాఖల అధికారుల కార్యాలయాలను ముట్టడించడమే కాకుండా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన అటవీశాఖ అధికారితో ఫోన్లో మాట్లాడారు గత కొన్ని రోజులుగా నల్ల చెరువులో తుమ్మ చెట్లను నరికి తీసుకువెళ్తున్న మీరు ఎందుకు పట్టించుకోవడంలేదని ఫోన్లో అధికారులను ప్రశ్నించారు ఈ అంశం తమ దృష్టికి వచ్చిందని త్వరలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారి వారికి హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆరే శ్రీధర్ గౌడ్ , దండే బోయిన వీరేష్ యాదవ్ , ముక్కెర్ల సతీష్ యాదవ్ , గ్యాదపాక క్రాంతి, మోత్కుపల్లి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి జిల్లా రథసారధి సాయిని మల్లేశంను ఘనంగా సన్మానించిన హుస్నాబాద్ బార్ అసోసియేషన్..



**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 11:**

బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశంను మంగళవారం రోజునా హుస్నాబాద్ బార్ అసోసియేషన్ ఘనంగా సన్మానించారు. ఆర్ఎస్ఎస్ స్వయం సేవక్, విశ్వహిందూ పరిషత్ , కరీంనగర్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులుగా , పార్టీకి అంకితభావంతో సేవలందించి భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా న్యాయవాది సాయిని మల్లేశం నియమితులు కావడం సంతోషకరంగా ఉందని , వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు బార్ అసోసియేషన్ సభ్యులు చెప్పారు.

**బిజెపి జిల్లా రథసారధి సాయిని మల్లేశం ఇన్స్పిరేషన్ నాయకుడని**

బిజెపి హుస్నాబాద్ నేత పొన్నం శ్రీనివాస్ కొనియాడారు. బిజెపి నాయకులు పొన్నం శ్రీనివాస్ మంగళవారం రోజున జిల్లా రథసారథి సాయిని మల్లేశంను ఘనంగా సన్మానించారు.కరీంనగర్ జిల్లా బీజేపీకి కొత్త దిశ , కొత్త నాయకత్వం సాయిని మల్లేశం ఆధ్వర్యంలో దక్కడం హర్షనీయమని , సాయిని మల్లేశం నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షిస్తూ, పనిచేసే ప్రతి సామాన్య కార్యకర్తకు సాయిని మల్లేశం ఇన్స్పిరేషన్ నాయకుడు అని పొన్నం శ్రీనివాస్ అన్నారు.




# ఖర్ఖానా గడ్డ-2 అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా సేవా కార్యక్రమం

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 11:**

కరీంనగర్ పట్టణం కార్ఖానా గడ్డ –2 అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం రోజున శ్రీ కృష్ణ చైతన్య అమ్మ ఫౌండేషన్ అధ్యక్షురాలు పద్మిని ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ స్కూల్ పిల్లలకు కాపీలు, పలకలు, బలపాలు, ఆట వస్తువులు మరియు బిస్కట్ ప్యాకెట్లు డొనేట్ చేయడం చేశారు. ఈ కార్యక్రమంలో 54వ డివిజన్ కార్పొరేటర్ గొట్టేముక్కుల ఉమారాణి, అంగన్వాడీ టీచర్ . కే వరలక్ష్మి , అంగన్వాడీ వర్కర్ పి. రమ, ఆసరా వర్కర్, ఆర్ పి మూర్తి, తల్లులు పిల్లలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ ఉమారాణి మాట్లాడుతూ శ్రీ కృష్ణ చైతన్య అమ్మ ఫౌండేషన్



పద్మిని ఆధ్వర్యంలో పద్మిని ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇంకా మరిన్ని చేయాలని ఆకాంక్షించి , ఈ సందర్భంగా వారిని అభినందించారు.

# ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రవికిరణ్.. కౌన్సిలర్ల అభినందనలు

**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 11:**

జహీరాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన నామ రవికిరణ్‌ను ఆయన సహచర కౌన్సిలర్లు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. చిన్న వయసులోనే ఆర్యవైశ్య సంఘం వంటి పెద్ద సంస్థకు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం గర్వకారణమన్నారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ సంఘానికి, సమాజానికి మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహమ్మద్ యాకూబ్, అబ్దుల్లా, మైపాల్ యాదవ్, పాండు ముదిరాజ్, విశ్వేశ్వర్,



రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనల మేరకే నూతన పెన్షన్ల మంజూరు

- **అర్హులైన వారు చేయూత పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి...**

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 11:**

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకే అర్హులైన లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్లు మంజూరు చేస్తామని గ్రామ పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు మంగళవారం గ్రామ పంచాయతీలో నూతన పెన్షన్ల కోసం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు .ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ నేరుగా గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకోవాలని, వాటిని ఉన్నతాధికారులకు నివేదించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.గ్రామ సర్పంచ్ చేష్మొద్దీన్ మాట్లాడుతూ పెన్షన్ కోసం దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ జిరాక్స్, రేషన్ కార్డు, గుర్తింపు పొందిన బ్యాంకు ఖాతా వివరాలు జతచేసి పంచాయతీకి అందించాలని





కోరారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గడ్డమిది చిన్నారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మహబూబ్ ఖాన్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు లతీఫ్ బీ అజీమొద్దీన్, వార్డు సభ్యులు మహమ్మద్ జాహెద్ అలీ, గొటటి శేఖర్ (చంటి), షేక్ దావుద్, నల్సబ్ హాజీమియా పాల్గొన్నారు.

# 'చలో కలెక్టరేట్'ను విజయవంతం చేయాలి: మోత్కూరి సుధీర్‌కుమార్

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 11:**

ఆగస్టు 17న భారతీయ మజ్దూర్ సంఘ్ (బి.ఎం.ఎస్.) చేపడుతున్న 'చలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీడీ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మోత్కూరి సుధీర్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్ లోని బి.ఎం.ఎస్. కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై అనంతరం మాట్లాడుతూ... జార్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీలో జూలై 26, 27, 28 తేదీలలో జరిగిన బి.ఎం.ఎస్. కేంద్ర కార్యకారిణి సమావేశంలో దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై విస్తృతంగా చర్చించారని, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కార్మిక వర్గ న్యాయమైన డిమాండ్ల సాధనకై 2026 ఆగస్టు 17న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. ఈ పోరాటం కేవలం ఏ ఒక్క రంగానికో పరిమితం కాదని, అసంఘటిత రంగ కార్మికులు, బీడీ కార్మికులు, బ్యాంకులు, ఎల్.ఐ.సి., ఇ.పి.ఎస్.–95 పింఛనుదారులు, పథక కార్మికులు (అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, ఆశా సిబ్బంది), భవన నిర్మాణ కార్మికులు, ప్లాట్‌ఫార్మ్ కార్మికులు, రవాణా కార్మికుల హక్కుల సాధన కోసం జరుగుతున్న చారిత్రాత్మక పోరాటమని మోత్కూరి సుధీర్ కుమార్




పేర్కొన్నారు. ఇ.యస్.ఐ.సి. అర్హత వేతన పరిమితిని రూ. 21,000 నుండి రూ. 42,000 కు పెంచి కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ఇ.పి.ఎఫ్. కనీస పెన్షన్‌ను రూ. 1,000 నుండి రూ. 7,500 కు పెంచి దానికి కరువు భత్యం (డి.ఎ.) అనుసంధానించాలని, ఉచిత ఇ.యస్.ఐ. / ఆయుష్మాన్ భారత్ వైద్య సౌకర్యం కల్పించాలని, ఇ.పి.ఎఫ్. వేతన పరిమితిని రూ. 15,000 నుండి రూ. 30,000 కు పెంచాలని, కనీస వేతనం రూ. 30,000 లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఒప్పంద, బాహ్య నిర్వహణ ఉద్యోగులకు సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) తీర్పు ప్రకారం సమాన వేతనం వర్తింపజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పపుల సురేష్, జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్, కార్యదర్శి తొర్తి శ్రీనివాస్, గోంటి సురేందర్, రేణిగుంట శంకర్, ఆవదుర్తి రవి, ప్రసాద్ మధుకర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# 2014 లో ఏ పార్టీ నుండి పోటీచేశారు ఆదిగారు..?

- **పార్టీ లు మారే మీరా విమర్శించేది.**
- **రాజన్న భక్తులకు నమ్మకాన్ని కలిగించండి.**
- **బీజేపీ మాజీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి**

**తిమ్మాపూర్ వెలుతురు ఆగస్టు 11:**

వేములవాడ నియోజకవర్గం నుండి 2014 లో ఏ పార్టీ నుండి పోటీ చేశారో, ఎందుకు చేశారోనని నియోజకవర్గ ప్రజలతో పాటుగా రాష్ట్ర ప్రజలకు ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వివరించాలని కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల బీజేపీ మాజీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి డిమాండ్ చేసారు.హిందువుల సంస్కృతి కి ఆలవాలమైన బోనాల పండగకు అరకొర నిధులు కేటాయించడం పై కేంద్ర మంత్రి వర్యులు బండి సంజయ్ మాట్లాడితే మత రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించడం ఆది అహంకారానికి నిదర్శమని మంగళవారం నాటి పత్రికా ప్రకటన లో పేర్కొన్నారు.2014 లో ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోతే బీజేపీ ని ఆశ్రయించి పోటీ చేసినప్పుడు తెల్వలేదా బీజేపీ గురించని ప్రశ్నించారు.కాంగ్రెస్ లో ఉన్నప్పుడు కూడా స్థానిక దేవాలయ అభివృద్ధి గురించి ఎన్నడైనా మాట్లాడినారా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అంటే ముస్లిమ్స్, ముస్లిమ్స్ అంటే కాంగ్రెస్ అని మాట్లాడిన ముఖ్యమంత్రి మాటలు గుర్తుకు లేవా అంటూ ప్రశ్నించారు. అవకాశాల కోసం పార్టీలు మారిన మీకు బీజేపీ ని, బీజేపీ నాయకులను విమర్శించే నైతిక హక్కు లేదని అన్నారు.కేంద్ర నిధుల మంజూరు విషయంలో కేంద్ర నిధులు రాకపోతే గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడిదని ప్రశ్నించారు. తెలంగాణ వ్యాప్తంగా హిందువులకు జరుగుతున్న అన్యాయాలపై ఆది శ్రీనివాస్ ఎప్పుడైనా ప్రశ్నించారా అని అడిగారు.బైంసా లో హిందువుల ఇళ్లను తగుల బెట్టినప్పుడు స్పందించింది, వారికి అండగా నిలిచింది బండి సంజయ్ కాకపోతే మీరా అని ప్రశ్నించారు. హిందువుల కోసం పోరాడేవ్యక్తిని విమర్శించే ముందు మీ పార్టీ ఏ మతస్తులకు కొమ్ము కాస్తుందో ప్రజలందరికీ తెలుసని అన్నారు. హైందవ సంస్కృతి కి రక్షణ గా



నిలవని మీరు, మీ పార్టీ కి చేతగాక బీజేపీ ని, బీజేపీ నాయకులను విమర్శించడం అతి తెలివికి అవివేకానికి పరాకాష్ట అని ఘాటుగా స్పందించారు. బండి పై విమర్శలు మాని దక్షిణ కాశీ గా పేరు గాంచిన వేములవాడ రాజన్న ఆలయాన్ని వెంటనే పూర్తి చేసి అక్కడి ప్రజలకు, స్వామి వారి భక్తులకు, హైందవ జాతికి మీపైన నమ్మకాన్ని కలిగించికోండని సూచించారు.

# నెలవారీ సమీక్షలో డా. కే. ఆనంద్ కీలక ఆదేశాలు

- టీబీ కేసుల నోటిఫికేషన్, ANC నమోదు, ఇమ్యునైజేషన్–NCD కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి

**మేడ్చల్ వెలుతురు ఆగస్టు 11:**





మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం, IDOC, అంతాయిపల్లి ప్రథమ అంతస్తులోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. కే. ఆనంద్ అధ్యక్షతన నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు, జిల్లా ప్రోగ్రాం అధికారులు, PHCలు/UPHCల వైద్యాధికారులు, రిపోర్టింగ్ సూపర్‌వైజర్లు, TB యూనిట్ సిబ్బంది STS, STLS, TBHVs హాజరయ్యారు. మాతృ ఆరోగ్యం, పోషణ, కుటుంబ నియంత్రణ, CHI, ఇమ్యునైజేషన్, NCD, IDSP, NTEP, NVBDCP, NVHCP, NLEP, NUHM, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (AAM), క్వాలిటీ అస్యూరెన్స్ తదితర కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. అలాగే PHCలు, UPHCలు, BDKలు, PDKలకు సంబంధించిన క్యాడర్ స్ట్రెంగ్త్, ఖాళీ పోస్టుల వివరాలు, మందుల నిల్వలు, పెండింగ్ విద్యుత్ బిల్లులు, నీటి బిల్లులు, భవన అద్దెలు, అవసరమైన చోట ప్రతికూల వార్తలపై రీజాయిండర్లు తదితర అంశాలను పరిశీలించారు. ప్రత్యేకంగా టీబీ కేసుల నోటిఫికేషన్‌ను మరింత మెరుగుపరచడం, గర్భిణీలను ప్రారంభ దశలోనే ANCకి నమోదు చేయించడం, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమయానుకూలంగా సాధించడంపై డా. కే. ఆనంద్ అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. MCH Kit పోర్టల్ లో పెండింగ్‌లో ఉన్న ఆన్‌లైన్ అప్‌డేషన్లను వెంటనే పూర్తి చేయాలని, వీపీడీ Surveillanceలో భాగంగా AFP మరియు MR Surveillanceను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అదేవిధంగా HPV వ్యాక్సినేషన్ పనితీరును మెరుగుపరచడంతో పాటు U–WIN పోర్టల్‌లో పెండింగ్ అప్‌డేషన్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి కార్యక్రమానికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసి, పెండింగ్ అంశాలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సూచించారు.

# ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- పేద, మధ్యతరగతి ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారం
- గుండు వెంకటనర్సు సిపిఎం మండల కార్యదర్శి

**మోత్కూర్, ఆగష్టు 11,వెలుతురు :**



దేశంలో రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ వాటిని నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు తీవ్రంగా విమర్శించారు. మోత్కూర్ మండలం రాగిభావి సిపిఎం పార్టీ గ్రామ శాఖ సమావేశం ఎన్నం వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.....ధరల పెరుగుదల కారణంగా పేదలు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, చిన్న ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వంట నూనె, పప్పుధాన్యాలు, బియ్యం, కూరగాయలు, పాలు, గుడ్లు, వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ వంటి నిత్యావసర వస్తువుల ధరలు నిరంతరం పెరుగుతుండటంతో సామాన్య కుటుంబాల నెలవారీ బడ్జెట్ పూర్తిగా దెబ్బతింటోందని పేర్కొన్నారు. ప్రజల ఆదాయం పెరగకపోయినా ఖర్చులు మాత్రం రోజురోజుకు పెరుగుతున్నాయని, దీనివల్ల పేద కుటుంబాల పై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం, ఇతర సేవల ఖర్చులు కూడా భారీగా పెరగడంతో ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. ధరల పెరుగుదలను అరికట్టడానికి ప్రభుత్వాలు ఎటువంటి సమర్థవంతమైన చర్యలు చేపట్టడం లేదని, కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధానాలను అమలు చేస్తూ సామాన్య ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తున్నాయని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, పానుగుల రమేష్, గ్రామ ఉపసర్పంచ్ పానుగుల లక్ష్మి , మెండు శేఖర్ రెడ్డి, ఎన్నం కలమ్మ , నారాబోయిన వెంకటమ్మ, అండాలు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలని వినతి

**మోత్కూర్, ఆగష్టు 11,వెలుతురు న్యూస్ :**

ప్రజలకు ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం కల్పించేందుకు సమాచార హక్కు చట్టం–2005 పై అవగాహన కల్పించే బోర్డులను ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమం లో సమాచార హక్కు చట్టం యాదాద్రి జిల్లా అధ్యక్షులు బీసు భాష,నోముల వెంకన్న, లోడి రవి కుమార్ పాల్గొన్నారు.



# న్యాయవాదుల గొంతుకగా ఎం ఎల్ ఎఫ్ జిల్లా జనరల్ సెక్రటరీగా సుక్క శ్రవణ్ కుమార్

- బలహీన వర్గాల న్యాయవాదుల హక్కులు జూనియర్ న్యాయవాదుల సంక్షేమమే లక్ష్యం

రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 11: యాదాద్రి భువనగిరి జిల్లా ఏం ఎల్ ఎఫ్ జనరల్ సెక్రటరీగా రామన్నపేటకు చెందిన న్యాయవాది, ఏ జి పి సుక్క శ్రవణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్ని క య్యారు. ఈ సందర్భంగా రామన్నపే ఎంఎల్ఎఫ్ సభ్యులు,సీనిర్ న్యాయవాదులు,సహచర న్యాయ వాదులు హర్షం వ్యక్తం శుభాకాంక్షలు తెలిపారు. బలహీన వర్గాల న్యాయవాదుల హక్కుల పరిరక్షణ, జూనియర్ న్యాయవాదుల సంక్షేమం, అడ్వకేట్ యాక్ట్ సమర్థవంతమైన అమలు, న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎం ఎల్ ఎఫ్ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తానని సుక్క శ్రవణ్ కుమార్ తెలిపారు. న్యాయవాదుల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ,బాధిత న్యాయవాదుల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.



# స్వాతంత్ర్య దినోత్సవానికి అన్ని ఏర్పాటు చేయాలి



- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేలో స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు
- మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**మేడ్చల్ వెలుతురు ఆగస్టు 11:**

స్వాతంత్ర్య దినోత్సవానికి అన్ని ఏర్పాటు చేయాలి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేలో స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు, మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి , బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని విసి హాల్ లో, ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలను కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాల్సిందిగా అదనపు కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకను తిలకించేందుకు వచ్చే అధికారులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సదుపాయాలు కల్పించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు వచ్చే అతిథికి పోలీస్ గౌరవ వందనంతోపాటు, బందోబస్తుల ఏర్పాట్లను చూడాలని పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. వేదిక, కుర్చీలు, బారికేడింగ్ సీటింగ్ వంటి ఏర్పాట్లు ఆర్ అండ్ బి శాఖ, వేదిక వద్ద రంగురంగు పూలతో అలంకరణకు ఉద్యానవన శాఖ అధికారులు చూసుకోవాలన్నారు. మైక్ సౌండ్ బాక్సులను ఏర్పాటు చేయాలని ఐఅండ్ పిఆర్ అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యార్థులచే దేశభక్తి ని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందచేసేందుకు అన్ని శాఖల అధికారుల వివరాలు సిద్దంగా ఉండేలా చూడాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మాలతి, కీసర ఆర్డిఓ వెంకట్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలపై పోరాటమే సీపీఐ లక్ష్యం

- సీపీఐ జిల్లా కార్యదర్శి వై. దామోదర్ రెడ్డి

**గుండాల, ఆగస్టు 11 (వెలుతురు):**




ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీకి ప్రజల మద్దతు మరింత పెరుగుతోందని సీపీఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి వై. దామోదర్ రెడ్డి అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామం నుంచి సీపీఐ ఆలేరు నియోజకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రను దామోదర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం యాత్ర సుద్దాల, బ్రాహ్మణపల్లి, రామారం గ్రామాల మీదుగా మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతోందని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ ప్రజల ఆదాయాలు మాత్రం పెరగడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి సంవత్సరం కోటి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులు, కార్మికులు, రైతులు, పేదల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మిక హక్కులను పరిరక్షించడంతో పాటు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, సామాజిక భద్రత కల్పించాలని కోరారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వ్యవసాయ రంగాన్ని రక్షించాలని, ధరల పెరుగుదలను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలు, కార్మికులు, రైతుల సమస్యలను పరిష్కరించి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరారు. సీపీఐ నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రకు ప్రజలు చూపుతున్న ఆదరణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు హరిచంద్ర మాట్లాడుతూ గ్రామాలకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరంగా అందించాలని, నవాబ్‌పేట రిజర్వాయర్ నుంచి ప్రతి చెరువు, కుంటను నీటితో నింపాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం తగిన విధంగా స్పందించకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సభ్యులు, మండల కార్యదర్శి ఏ. రామచంద్రయ్య, మండల కార్యవర్గ సభ్యులు దయాకర్ రెడ్డి, బక్కయ్య, శ్రీను, ఆంజనేయులు, స్వామి, శ్రీశైలం, జి. వెంకటయ్య, చంద్రయ్య, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పరపల్లి, హైదర్గూడా డివిజన్‌లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'

- సగర్వంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన బిజెపి నేతలు

**ఉప్పరపల్లి వెలుతురు ఆగస్టు 11:**







ఉప్పరపల్లి (హైదర్గూడా డివిజన్) భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి పిలుపు మేరకు ఉప్పరపల్లి, హైదర్గూడా డివిజన్ లో HarGharTiranga కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బిజెపి వనపర్తి జిల్లా ఇన్‌ఛార్జ్ శ్రీ బొక్కా బాల్ రెడ్డి గారు ఉప్పరపల్లిలోని తమ నివాసం పైన సగర్వంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అదేవిధంగా డివిజన్‌లోని బిజెపి కార్యకర్తలందరూ తమ తమ ఇండ్ల పైన జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తి స్ఫూర్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ బొక్కా బాల్ రెడ్డి గారు మాట్లాడుతూ... ప్రధాని మోదీ గారి పిలుపుతో సాగుతున్న 'హర్ ఘర్ తిరంగా' ఉద్యమం ప్రతి ఒక్కరిలో జాతీయ సమైక్యతను, అమరవీరుల త్యాగ నిరతిని గుర్తు చేస్తోందని పేర్కొన్నారు. హైదర్గూడా డివిజన్ వ్యాప్తంగా ప్రతీ ఇంటా త్రివర్ణ పతాకం ఎగరడం మన దేశ సమగ్రతకు, ఐక్యతకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి వనపర్తి జిల్లా ఇన్‌ఛార్జ్ బొక్కా బాల్ రెడ్డి, నాయకులు ఎస్. విఠల్, బీజేవైఎం వైస్ ప్రెసిడెంట్ గోనే శ్రీకాంత్ రెడ్డి, రాజేంద్రనగర్ జనరల్ సెక్రటరీ పవన్ కుమార్, పలుగుచేరు నరేందర్, భూపాల్ ముదిరాజ్, మహేష్ ముదిరాజ్, మధుసూదన్ రెడ్డి, బాలసాయి, ప్రవీణ్, గోనే మోహన్ రెడ్డి, రాకేష్ తదితర బిజెపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు విశేషంగా పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నియంత్రణకు నిరంతరం వైద్య సేవలు అందించాలి

- హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 11:**







మంగళవారం రోజున జాంబాగ్ పార్క్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా DM&HO గారు హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, లాబొరేటరీ కేంద్రాన్ని, వివిధ రికార్డులు మరియు పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గర్భిణీల స్త్రీల సంరక్షణ, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధులు నియంత్రణ, మలేరియా, డెంగీ, చికున్‌గునియా నివారణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించి, ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమములో ఎస్పీహెచ్ఓ బిర్జిస్ ఉన్నిసా గారు, వైద్యాధికారి తరుణి గారు మరియు సిబ్బంది హాజరైనారు.

# సామాజికవేత్త పొడిశెట్టి నారాయణస్వామి కన్నుమూత

- మంత్రి సీతక్క పరామర్శ.. కుటుంబానికి మనోధైర్యం

**ములుగు, వెలుతురు ఆగస్టు 11:**

ములుగు ప్రాంతానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు పొడిశెట్టి నారాయణస్వామి (95) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి 9 గంటలకు తుదిశ్వాస విడిచారు. మంత్రి సీతక్క పరామర్శం నారాయణస్వామి గారి మరణవార్త తెలుసుకున్న రాష్ట్ర మంత్రి సీతక్క ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యం కల్పించారు. నారాయణస్వామి గారితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న మంత్రి సీతక్క, చిన్ననాటి పాఠశాల రోజుల్లో ఆయన తనకు పాఠశాల యూనిఫారాలు కుట్టి ఇచ్చేవారని తెలిపారు. అంతేకాకుండా చిన్ననాటి నుంచే పిల్లలు పొదుపు నేర్చుకోవాలని ఆయన 'సుధాకర్ చిన్న పిల్లల పొదుపు పథకం' పేరుతో ఒక పథకాన్ని ప్రారంభించారని, తాను ఆ పథకానికి సభ్యురాలినని గుర్తు చేసుకున్నారు. ఆయన 'అమేజింగ్ తెలంగాణ' ఎడిటర్



రమేష్ కుమార్ తండ్రి కావడం గమనార్హం.ఆయన మృతి వార్త తెలియగానే ములుగు ప్రాంత ప్రజలు, అభిమానులు, సామాజిక సేవా రంగానికి చెందిన పలువురు తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు.

**సుదీర్ఘ సామాజిక సేవ**

నారాయణస్వామి గారు ములుగు ప్రాంతంలో సుదీర్ఘ కాలంగా సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలిచారు. నిరాడంబర జీవితం గడుపుతూ, తనకు చేతనైన రీతిలో సమాజానికి సేవ చేయడం ద్వారా స్థానిక ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.



ఆయన మరణం ములుగు ప్రాంతానికి తీరని లోటు అని పలువురు పేర్కొన్నారు. నారాయణస్వామి గారు గొప్ప మానవతావాది. సమాజం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. ఆయన తో నాకు ఉన్న అనుబంధం ఎంతో ప్రత్యేకమైనది. ఆయన మరణం వ్యక్తిగతంగా నాకు కూడా ఎంతో బాధ కలిగించింది" అని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులుఈ కార్యక్రమంలో ములుగు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి నారాయణస్వామి కుమారులు సుధాకర్, ప్రభాకర్, రవీందర్, దిలీప్ కుమార్, రమేష్ కుమార్ తో పాటు బంధు మిత్రులు పాల్గొన్నారు. ములుగు ప్రాంతంలో సామాజిక సేవకే జీవితాన్ని అంకితం చేసిన పొడిశెట్టి నారాయణస్వామి సేవలు, ఆయనతో తమకున్న అనుబంధాన్ని ప్రజలు చిరకాలం గుర్తు చేసుకుంటారని స్థానికులు అన్నారు.




# అమిత్ షా సమాధానం చెప్పాల్సిందే

- పార్లమెంట్ వద్ద అధికార, విపక్షాల పోటాపోటీ నిరసనలు
- చివరి దశలోనూ సభలో ప్రతిష్ఠంభన
- అమిత్ షా సమాధానం ఇవ్వాలన్న విపక్షం
- ఢిల్లీ విద్యార్థుల నిరసనపై చర్చకు డిమాండ్

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 11:**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి దశలోనూ అధికార, విపక్షాల మధ్య నెలకొన్న రాజకీయ ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. మంగళవారం పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ఎన్డీయే, విపక్ష ఎంపీలు వేర్వేరుగా నిరసనలు చేపట్టడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళన సందర్భంగా చోటుచేసుకున్న పోలీసుల చర్యపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో సమాధానం చెప్పాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు.జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల నిరసనలపై కేంద్రం వివరణ ఇవ్వాలని కోరుతూ విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. ఈ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే ప్రకటించిన విషయాన్ని విపక్షాలు ప్రస్తావించాయి. అయితే కేవలం ప్రకటన కాకుండా.. తాము లేవనెత్తిన ప్రశ్నలకు హోంమంత్రి సమాధానం ఇవ్వాలని పట్టుబట్టాయి.అదే సమయంలో జార్ఖండ్‌లో ఉద్యోగార్థులు, విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసుల చర్యను ప్రస్తావిస్తూ ఎన్డీయే ఎంపీలు కూడా నిరసనకు దిగారు. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరిగిన నిరసనలపై మాట్లాడుతున్న రాహుల్.. జార్ఖండ్‌లో విద్యార్థులపై జరిగిన పోలీసుల చర్య విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై కూడా పార్లమెంట్‌లో చర్చ జరపాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. దీంతో పార్లమెంట్ ఆవరణలో అధికార, విపక్ష సభ్యుల మధ్య రాజకీయ వేడి మరింత పెరిగింది. ఇరువర్గాలు తమ తమ అంశాలపై నినాదాలు చేయడంతో కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది.విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన అంశంపై ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని కిరణ్ రిజిజు సోమవారం స్పష్టం చేశారు. హోంమంత్రి అమిత్ షా ఈ అంశంపై సమాధానం ఇస్తారని తెలిపారు. అయితే ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వం ఇచ్చే సమాధానాన్ని ప్రశాంతంగా వినాలని ఆయన కోరా రు. మరో వైపు, జార్ఖండ్ ఘటనపై చర్చకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



ముందుకు రావడం లేదని ఎన్డీయే ఎంపీలు ఆరోపించారు. వివిధ అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే రాహుల్.. వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచే పలు అంశాలపై అధికార, విపక్షాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. సమావేశాలు ముగింపు దశకు చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య రాజకీయ పోరు మరింత ముదిరింది. తాజా నిరసనల నేపథ్యంలో పార్లమెంట్ కార్యకలాపాలు కూడా ప్రభావితమయ్యాయి .విపక్ష సభ్యుల ఆందోళనల మధ్య సభా కార్యకలాపాలు కొనసాగినప్పటికీ పరిస్థితి సద్దుమణగలేదు. చివరకు సభను బుధవారానికి వాయిదా వేశారు. సమావేశాల చివరి రోజుల్లోనైనా కీలక అంశాలపై చర్చ జరుగుతుందా, లేక రాజకీయ నిరసనలతోనే సమయం గడుస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

# ప్రతి ఒక్కరూ రాజ్యాంగ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత
- హనుమకొండ కేడీసీలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, వెలుతురు ఆగస్టు 11:**

రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు పౌరులుగా మన బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. మంగళవారం హనుమకొండ లోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (CBC)వరంగల్ ఫీల్డ్ కార్యాలయం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' పై రెండు రోజుల ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ ఔట్రీచ్ ప్రోగ్రాం (ICOP), ఫోటో ఎక్సిబిషన్ ను పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన అనంతరం వరంగల్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ తరుణ్ కుమార్ బోడా సీబీసీ రూపొందించిన జాతీయ పతాకం యొక్క ప్రస్థానం, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల పై ఫోటో ఎగ్జిబిషన్‌లోని అంశాలను వివరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి పోలీస్ కమిషనర్ ప్రసంగిస్తూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలను కాపాడటంతో పాటు దేశ అభివృద్ధిలో యువత క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని సూచించారు. మన రాజ్యాంగంలో రాసుకున్న హక్కులు, బాధ్యతలు ఏవైతే ఉన్నాయో పౌరులుగా మన బాధ్యత ఏంటి అనేవి ఇలాంటి కార్యక్రమాలు మనకి గుర్తు చేస్తాయన్నారు. ఎప్పుడూ మనం హక్కుల కోసం పోరాడడం అనేది ఒక నాణేనికి ఒక వైపు మాత్రమే. ఇంకోవైపు మన బాధ్యత ఏముంది అనేది తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. మనకి దక్కిన స్వాతంత్ర్యానికి మనం గౌరవం, విలువ ఇస్తూ, భవిష్యత్తు తరాలకి ఎటువంటి సమాజాన్ని అందిస్తామో అనేది మనపైనే ఆధార పడి ఉంటుందన్నారు. దేశాభివృద్ధి, భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందన్నారు. మిమ్మల్ని మీరు ఎలా మలుచుకుంటారు అనేది మీ చేతుల్లోనే ఉంటుందని యువతను ఉద్దేశించి అన్నారు. మీ జీవితాలు మీరు ఎలా మలుచుకుంటారు అనేది వందకి వంద శాతం మీ చేతుల్లోనే ఉంటుందని, కష్టపడి మన జీవితాన్ని మనమే మెరుగుపరచుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ కేంద్ర సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అలాగే క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీలలో విద్యార్థులు చాలామంది ఉత్సాహంగా పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటం, స్వాతంత్ర్యం కోసం




జరిగిన త్యాగాలు, పోరాటాల జ్ఞాపకాలు ఎప్పటికీ గుర్తుంచుకోవాలన్నారు. స్వతంత్ర భారతదేశంలో జన్మించడం మన అదృష్టం అని అన్నారు. ఇంత గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థను వారసత్వంగా పొందడం మనకు లభించిన గొప్ప అవకాశమని తెలిపారు. మన రాజ్యాంగాన్ని పొందడం మన అదృష్టం అని పేర్కొన్నారు. ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు మనకు ఉన్నాయని అన్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 15వ తేదీని, జనవరి 26వ తేదీని ఎంతో ఘనంగా జరుపుకుంటామని, ఇలాంటి కార్యక్రమాలను కూడా ప్రతి సంవత్సరం స్వాతంత్ర్యం వెనుక ఎంతటి కృషి, త్యాగం, పోరాటం దాగి ఉందో మనం ఎప్పటికీ మరచిపోకూడదనే ఉద్దేశంతో నిర్వహిస్తుంటామని అన్నారు. మనం ఈరోజు చూస్తున్న జాతీయ పతాకం ఒక్క రోజులో రూపుదిద్దుకున్నది కాదు అని దాని వెనుక ఎన్నో సంవత్సరాల కృషి, ఎన్నో పోరాటాలు ఉన్నాయని తెలిపారు. మనం పొందిన స్వేచ్ఛను, మనకు లభించిన ఈ ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంతో కృతజ్ఞతతో గుర్తుంచుకోవాలని అన్నారు. మనకు లభించిన ఈ స్వేచ్ఛను కాపాడుకోవడంతో పాటు, భవిష్యత్ తరాలకు మరింత బలమైన ప్రజాస్వామ్యాన్ని అందించేందుకు మన వంతు కృషి చేయాలన్నారు. కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర సమాచార శాఖ ఆధ్వర్యం లో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' పై పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. విద్యార్థులలో దేశం పట్ల బాధ్యత పెంపొందించటానికి ఇటువంటి కార్యక్రమాలు అవసరం అన్నారు. ఈ కార్యక్రమం లో కళా బృందాలు 'హర్ ఘర్ తిరంగా' పై ప్రదర్శించిన యక్షగానం విద్యార్థులను ఆకట్టుకుంది. క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు .ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రజనీ లత,ప్రోగ్రామ్ ఇన్చార్జి సమత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహనకు భారీ ర్యాలీ.. నేడే హైదరాబాద్ లో నిర్వహణ




- రెండు నెలల పాటు విస్తృత ప్రచారం
- హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణే లక్ష్యం
- సిఫిలిస్‌పైనా అవగాహన కార్యక్రమాలు
- ఉదయం 7 గంటలకు ర్యాలీ ప్రారంభం
- హెచ్ఎండీఏ గ్రౌండ్స్ నుంచి ర్యాలీ
- నెక్లెస్ రోడ్ వరకు కొనసాగింపు
- సుమారు 1500 మంది పాల్గొనే అవకాశం
- విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తల భాగస్వామ్యం
- బాధితులకు మెరుగైన వైద్యం అందించడంపై దృష్టి
- తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 11:**

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు హైదరాబాద్‌లో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ★ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు★ రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో పాటు సిఫిలిస్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని చెప్పారు. బుధవారం ఉదయం ★7 గంటలకు హైదరాబాద్‌లోని ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్ నుంచి★ అవగాహన ర్యాలీ ప్రారంభమవుతుందని మంత్రి తెలిపారు. అక్కడి నుంచి నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగుతుందని వెల్లడించారు. సుమారు ★1,500 మంది★ ఇందులో పాల్గొంటారని చెప్పారు. మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి పొన్నం ప్రభాకర్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించనున్నారు. కాలేజీ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులతో పాటు స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొననున్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి మెరుగైన వైద్య చికిత్స అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని దామోదర రాజనర్సింహ తెలిపారు. హెచ్ఐవీ ఒకరి నుంచి మరొకరికి, ముఖ్యంగా పుట్టబోయే శిశువులకు సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ నిర్మూలన కోసం చేపడుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ★'బి పాజిటివ్ టు స్టాప్ హెచ్ఐవీ పాజిటివ్'★ అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. హెచ్ఐవీపై అపోహలను తొలగించడం, వ్యాధి వ్యాప్తిని అరికట్టడం, బాధితులకు అవసరమైన వైద్య సహాయం అందేలా చూడటం వంటి అంశాలపై రెండు నెలల పాటు విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణను ★హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే★ ప్రభుత్వ లక్ష్యమని దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు.

# నా ఓటు కూడా గల్లంతైంది

- ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్
- 65 లక్షల ఓట్ల తొలగింపులో నాది ఉంది
- సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో
- బెంగళూరు నియోజకవర్గంలోనే జననం
- ఇక్కడే చదువు, నటన అభ్యాసం
- ఎంపీ అభ్యర్థిగానూ పోటీ చేసిన నటుడు
- ఓటు తొలగించడంపై తీవ్ర వ్యంగ్యం
- మళ్లీ కార్డు కోసం పత్రాలేంటంటూ ప్రశ్న
- నాలుగు రాష్ట్రాల్లో ఓటు ఉందంటూ ఆరోపణలు
- ఇప్పటికే ప్రకాశ్ రాజ్‌పై కేసు
- నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ



**బెంగళూరు, వెలుతురు, ఆగస్టు 11:**

బెంగళూరులో ఓటర్ల జాబితా నుంచి భారీగా ఓట్లు తొలగించారన్న అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై నటుడు ప్రకాశ్ రాజ్ స్పందిస్తూ.. తొలగించబడినట్లు చెబుతున్న 65 లక్షల ఓట్లలో తన ఓటు కూడా ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ సెల్ఫీ వీడియోను విడుదల చేసి ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియపై ప్రశ్నలు సంధించారు.తాను పుట్టింది, పెరిగింది బెంగళూరులోనేనని ప్రకాశ్ రాజ్ గుర్తుచేశారు. తన విద్యాభ్యాసం మొత్తం అక్కడే జరిగిందని, నటనకు సంబంధించిన శిక్షణ కూడా అదే నగరంలో తీసుకున్నానని చెప్పారు. అంతేకాకుండా ఇదే నియోజకవర్గం నుంచి లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఇలాంటి నేపథ్యం ఉన్న తన ఓటును కూడా తొలగించడం ఆశ్చర్యంగా, హాస్యాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు.ఓటు హక్కును తిరిగి పొందేందుకు అధికారులు ఎలాంటి పత్రాలు అడుగుతారోనని ఆయన వ్యంగ్యంగా ప్రశ్నించారు. అవసరమైన అన్ని పత్రాలతో తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో తమకు నచ్చని వ్యక్తుల ఓట్లను తొలగించే అధికారం అధికారులకు ఉండొచ్చని, అయితే ప్రజలు తమ ఓటుతో ప్రభుత్వాలను మార్చకుండా అడ్డుకునే అధికారం ఎవరికీ లేదని వ్యాఖ్యానించారు.''మీకు ఓటు వేయని వారిని తొలగించే అధికారం మీకు ఉండొచ్చు. కానీ మిమ్మల్ని అధికారం నుంచి దింపకుండా మమ్మల్ని ఆపగలరా?'' అంటూ ప్రకాశ్ రాజ్ ప్రశ్నించారు. చివర్లో 'గేమ్ ఆన్' అంటూ తన వ్యాఖ్యలను ముగించారు.ఇదిలా ఉండగా.. ప్రకాశ్ రాజ్‌కు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణతో పాటు మరో రాష్ట్రంలోనూ ఓటరు కార్డులు ఉన్నాయంటూ గతంలో ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై బెంగళూరులో కేసు నమోదైంది. కేసుకు సంబంధించి జారీ చేసిన నోటీసులకు స్పందించకపోవడంతో ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ కూడా జారీ చేసినట్లు సమాచారం.ఈ కేసు విచారణలో భాగంగా జులైలో ప్రకాశ్ రాజ్ బెంగళూరు కోర్టుకు హాజరయ్యారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. తాజాగా ఓటర్ల జాబితా సవరణ అంశంపై ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలు మరోసారి రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చకు దారితీశాయి.

# నియోజకవర్గ అభివృద్ధి కోసమే రేవంత్ వద్దకు వెళ్లా: పోచారం

- కండువా కప్పుకున్నది అభివృద్ధి కోసమే
- పెండింగ్ బిల్లులపై సీఎం హామీ
- ఆరు నెలల్లో నిధులిస్తామని చెప్పారని వెల్లడి
- హామీలో సగం నిధులే వచ్చాయన్న పోచారం
- బిల్లులు రాక గుత్తేదారులు పనులు ఆపారని వ్యాఖ్య

**బీర్కూర్, వెలుతురు, ఆగస్టు 11:**

నియోజకవర్గ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లి కాంగ్రెస్ కండువా కప్పుకున్నానని బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అయితే తన నియోజకవర్గానికి రావాల్సిన నిధుల్లో ఇప్పటికీ పూర్తి స్థాయిలో విడుదల కాలేదని అన్నారు. ఆరు నెలల్లో పెండింగ్ బిల్లులన్నీ మంజూరు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ.. అందులో సగం నిధులు మాత్రమే అందాయని చెప్పారు.కామారెడ్డి జిల్లా బీర్కూరులో కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా తన రాజకీయ నిర్ణయం, నియోజకవర్గ అభివృద్ధి, పెండింగ్ బిల్లులు, నిధుల విడుదలపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.నియోజకవర్గంలో అభివృద్ధి



పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో గుత్తేదారులు పనులను నిలిపివేశారని పోచారం తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. గత నవంబర్‌లో ఫిరాయింపు ఎమ్మెల్యేలతో సమావేశం జరిగిన సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఈ అంశంపై నేరుగా ప్రశ్నించినట్లు వెల్లడించారు.ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నుంచి నిధులు మంజూరు కాలేదని పోచారం వ్యాఖ్యానించారు. ఆరు నెలల్లో పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తామని హామీ ఇచ్చినా.. ఇప్పటివరకు సగం నిధులు మాత్రమే వచ్చాయని అన్నారు.

తన రాజకీయ జీవితంలో తనకు అండగా నిలిచిన వారిని ఎప్పటికీ మర్చిపోనని పోచారం అన్నారు.''అన్నం పెట్టిన వాళ్లను ఎప్పుడూ మర్చిపోలేను''అని వ్యాఖ్యానించారు. నియోజకవర్గ ప్రజల ప్రయోజనాలు, అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాలకు ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు.

# హిమాచల్‌లో వానల బీభత్సం

- 157 మంది మృతి, 257 మంది గల్లంతు
- భారీ వర్షాలతో రాష్ట్రం అతలాకుతలం
- వరదలు, కొండచరియలతో 68 మంది మృతి
- రోడ్డు ప్రమాదాల్లో మరో 89 మంది మృతి
- 257 మంది ఆచూకీ కోసం గాలింపు
- రూ.886 కోట్లకు పైగా ఆస్తి నష్టం
- 900కుపైగా ఆస్తులు ధ్వంసం
- 259 రహదారులు దెబ్బతిన్న వైనం
- 161 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయని పరిస్థితి
- 54 తాగునీటి పథకాలకు అంతరాయం
- ఐదు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్




**సిమ్లా, వెలుతురు, ఆగస్టు 11:**

హిమాచల్‌ప్రదేశ్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు తీవ్ర విషాదాన్ని, భారీ నష్టాన్ని మిగుల్చుతున్నాయి. వరదలు, కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు, రోడ్డు ప్రమాదాలతో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 157 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 257 మంది గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. జూన్ 30 నుంచి ఆగస్టు 9 వరకు చోటుచేసుకున్న ఘటనల ఆధారంగా ఈ గణాంకాలను రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం వెల్లడించింది.ఈ కాలంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా 68 మంది మృతి చెందగా.. రోడ్డు ప్రమాదాల్లో మరో 89 మంది ప్రాణాలు కోల్పోయారు. భారీ వర్షాలతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. దాదాపు 900 ఆస్తులు దెబ్బతినగా.. మొత్తం నష్టం సుమారు రూ.886 కోట్లకు చేరినట్లు అధికారులు అంచనా వేశారు.వర్షాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరా వ్యవస్థ కూడా దెబ్బతింది. ముఖ్యంగా కుల్లు, మండి జిల్లాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. సుమారు 161 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు) వారం రోజులుగా పనిచేయడం లేదని అధికారులు తెలిపారు. వీటిలో మండిలో 77, సిమ్లాలో 43, కుల్లులో 40 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నట్లు వెల్లడించారు.కుల్లు జిల్లాలో భారీ వర్షాల కారణంగా నదులు, వాగుల్లో నీటిమట్టాలు ఒక్కసారిగా పెరుగుతున్నాయి. దీంతో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, భూమి కుంగిపోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. పలు ప్రాంతాల్లో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.రహదారి వ్యవస్థపైనా వర్షాలు తీవ్ర ప్రభావం చూపాయి. కొండచరియలు విరిగిపడటం, భూమి కుంగిపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 259 రహదారులు దెబ్బతిన్నాయి. వీటిలో అత్యధికంగా మండి జిల్లాలో 120 రోడ్లు మూతపడ్డాయి. చంబాలో 42, కుల్లులో 40, సిమ్లాలో 30 రహదారులు దెబ్బతిన్నాయి.దెబ్బతిన్న రహదారులను పునరుద్ధరించేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నప్పటికీ.. వర్షాలు నిరంతరం కురుస్తుండటంతో పనులకు ఆటంకం ఏర్పడుతోంది. కొండ ప్రాంతాల్లో రాకపోకలను పునరుద్ధరించడం అధికారులకు సవాలుగా మారింది.తాగునీటి సరఫరా కూడా దెబ్బతింది. రాష్ట్రవ్యాప్తంగా 54 నీటి సరఫరా పథకాలు వర్షాల ప్రభావానికి గురైనట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయి. దీంతో పలు ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ఇంతటి నష్టం జరిగినప్పటికీ హిమాచల్‌ప్రదేశ్‌కు వర్ష ముప్పు ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. కాంగ్రా, మండి, హమీర్‌పూర్, సిమ్లా, సిర్మౌర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సిమ్లా ప్రాంతీయ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ ఐదు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.చంబా, కుల్లు, సోలన్, బిలాస్‌పూర్ జిల్లాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొండచరియలు విరిగిపడే ప్రాంతాలు, నదులు, వాగుల సమీపంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.

# కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే ట్రాఫిక్.. 18 నుంచి అమలు


- ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణంతో మార్పులు
- హెచ్-సిటీ ప్రాజెక్ట్‌లో పనులు కొనసాగింపు
- కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు
- ఈ నెల 18 నుంచి వన్‌వే విధానం
- వాహనదారులు ముందుగానే ప్రయాణం ప్లాన్ చేసుకోవాలి
- లేన్ మార్కింగ్‌లను తప్పనిసరిగా పాటించాలి
- దిశా సూచికలపై వాహనదారులు దృష్టి పెట్టాలి
- ట్రాఫిక్ పోలీసుల సూచనలకు అనుగుణంగా ప్రయాణం
- రద్దీని తగ్గించేందుకు పోలీసుల చర్యలు
- నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు మార్పులు




హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ఈ నెల 18వ తేదీ నుంచి వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని అమలు చేయనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న కారిడార్‌లో హెచ్-సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. నిర్మాణ పనుల కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా, ట్రాఫిక్ నిర్వహణను సులభతరం చేసేందుకు కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ మార్పులు అమల్లోకి వచ్చే నేపథ్యంలో వాహనదారులు తమ ప్రయాణాలను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని పోలీసులు సూచించారు.ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకునే వారు ప్రయాణ సమయాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుగానే బయలుదేరాలని సూచించారు. రహదారులపై ఏర్పాటు చేసే లేన్ మార్కింగ్‌లు, దిశా సూచికలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణ కోసం ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసు సిబ్బంది సూచనలను వాహనదారులు పాటించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు. హెచ్-సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా కేబీఆర్ పార్క్ పరిసర కారిడార్‌లో చేపడుతున్న ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం పూర్తయ్యే వరకు ట్రాఫిక్ నిర్వహణలో అవసరాన్ని బట్టి మార్పులు చేపట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# హైదరాబాద్‌లో ట్రంప్ టవర్స్.. 65 అంతస్తులతో రెండు భారీ టవర్లు

- కోకాపేటలో ప్రతిష్ఠాత్మక నిర్మాణం
- గోల్డెన్ మైల్ రోడ్డులో ప్రాజెక్ట్
- 240 మీటర్ల ఎత్తులో టవర్లు
- మొత్తం 450 లగ్జరీ ఫ్లాట్లు
- ఒక్కో ఫ్లాట్ ధర రూ.5 కోట్ల నుంచి
- రూ.1,800 కోట్ల వరకు నిర్మాణ వ్యయం
- రూ.4,200 కోట్ల వరకు ఆదాయ అంచనా
- 16 పెంట్‌హౌస్‌లలో 8 ఇప్పటికే విక్రయం
- దక్షిణ భారత్‌లో ఇదే తొలి ట్రంప్ టవర్స్
- మూడేళ్లలో నిర్మాణం పూర్తి లక్ష్యం





**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 11:**

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో మరో భారీ లగ్జరీ ప్రాజెక్ట్ రూపుదిద్దుకోనుంది. నగరంలోని కోకాపేట గోల్డెన్ మైల్ రోడ్డులో ట్రంప్ టవర్స్ పేరుతో రెండు భారీ టవర్లను నిర్మించేందుకు ట్రంప్ ఆర్గనైజేషన్, ట్రిబెకా డెవలపర్స్, ఐరా రియాల్టీ సంస్థలు కలిసి ప్రాజెక్ట్‌ను చేపట్టనున్నాయి. ఈ ప్రాజెక్టులో 65 అంతస్తులతో రెండు టవర్లు నిర్మించనున్నారు.సుమారు 240 మీటర్ల ఎత్తు★★ ఉండే ఈ టవర్లు పూర్తయితే దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఎత్తయిన టవర్లలో నిలవనున్నాయి. అలాగే భారతదేశంలో నిర్మిస్తున్న ట్రంప్ టవర్స్‌లోనూ ఇవే అత్యంత ఎత్తయినవిగా నిలుస్తాయని సంస్థలు చెబుతున్నాయి. ప్రాజెక్టుకు ఇప్పటికే రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) అనుమతులు లభించినట్లు వెల్లడించారు. ట్రంప్ టవర్స్‌లో మొత్తం 450 అత్యంత విలాసవంతమైన అపార్ట్‌మెంట్లు ఉండనున్నాయి. వీటి ధరలు రూ.5 కోట్ల నుంచి ప్రారంభమవుతాయని ట్రిబెకా డెవలపర్స్ వ్యవస్థాపకుడు కల్పేశ్ మెహతా తెలిపారు. ప్రాజెక్టు భూమి ఖర్చును మినహాయిస్తే నిర్మాణానికి సుమారు రూ.1,700 కోట్ల నుంచి రూ.1,800 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు.ఈ ప్రాజెక్టు ద్వారా రూ.3,500 కోట్ల నుంచి రూ.4,200 కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని కల్పేశ్ మెహతా వెల్లడించారు. హైదరాబాద్‌లో ట్రంప్ బ్రాండ్‌తో ఒక భారీ ప్రాజెక్ట్ చేపట్టాలని చాలాకాలంగా భావిస్తున్నామని, ఇప్పుడు ఆ కల నెరవేరుతోందని ఆయన పేర్కొన్నారు.ప్రాజెక్టులో అత్యంత విలాసవంతమైన 16 పెంట్‌హౌస్‌లు కూడా ఉండనున్నాయి. వీటిలో ఇప్పటికే ఎనిమిది విక్రయాలు పూర్తయ్యాయని సంస్థ వెల్లడించింది. ఒక పెంట్‌హౌస్ గరిష్ఠంగా రూ.62 కోట్లకు విక్రయించినట్లు కల్పేశ్ మెహతా తెలిపారు. దీంతో హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన నివాస ప్రాజెక్టుల్లో ట్రంప్ టవర్స్ ఒకటిగా నిలవనుంది.ట్రంప్ టవర్స్ నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబ సభ్యులు హాజరయ్యే అవకాశం ఉందని ప్రాజెక్టు వర్గాలు తెలిపాయి. త్వరలోనే భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించాయి.నిర్మాణ పనులను ప్రారంభించిన తర్వాత సుమారు మూడేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయాలని ట్రిబెకా డెవలపర్స్, ఐరా రియాల్టీ లక్ష్యంగా పెట్టుకున్నాయి. హైదరాబాద్‌లో పెరుగుతున్న ప్రీమియం నివాసాల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు సంస్థలు చెబుతున్నాయి.ముంబయికి చెందిన ట్రిబెకా డెవలపర్స్ ఇప్పటికే ట్రంప్ బ్రాండ్‌తో దేశంలోని పలు నగరాల్లో ప్రాజెక్టులను చేపట్టింది. ట్రంప్ టవర్స్ పేరుతో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఎనిమిది ప్రాజెక్టులను ప్రకటించినట్లు సంస్థ తెలిపింది. వీటిలో పుణె, ముంబయి, కోల్‌కతా, గురుగ్రామ్‌లలో నాలుగు ప్రాజెక్టులు పూర్తయ్యాయి.ఇప్పటివరకు ఉత్తర, పశ్చిమ, తూర్పు భారతదేశంలోని ప్రధాన నగరాల్లో ట్రంప్ బ్రాండ్ ప్రాజెక్టులు ఉండగా.. దక్షిణ భారతదేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో నిర్మించనున్నారు. కోకాపేటలోని గోల్డెన్ మైల్ రోడ్డులో వస్తున్న ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్ లగ్జరీ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో మరో భారీ బ్రాండెడ్ రెసిడెన్షియల్ ప్రాజెక్టు చేరనుంది.

# మిస్సింగ్ కేసుల్లో ఆలస్యం వద్దు

- వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి: సుప్రీంకోర్టు
- వయసు, లింగంతో సంబంధం లేదు
- తప్పిపోయిన ప్రతి వ్యక్తికీ ఇదే నిబంధన
- పిల్లలకే పరిమితం కాదన్న స్పష్టత
- రాష్ట్రాల తీరుపై సుప్రీం అసహనం
- తొలి గంటల్లోనే వేగంగా స్పందించాలి
- ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాలి



**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 11:**

ఒక వ్యక్తి అదృశ్యమైనట్లు సమాచారం అందిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి, ఆచూకీ కోసం చర్యలు ప్రారంభించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మిస్సింగ్ కేసుల్లో వయసు, లింగం వంటి అంశాలను కారణంగా చూపి స్పందించడంలో ఆలస్యం చేయరాదని తేల్చిచెప్పింది. గతంలో తాము జారీ చేసిన ఆదేశాల్లోని 'పర్సన్' అనే పదాన్ని కేవలం పిల్లలకు మాత్రమే పరిమితం చేయడం సరికాదని పేర్కొంది.తమ ఆదేశాలను కొన్ని రాష్ట్రాలు తప్పుగా అర్థం చేసుకుంటున్నాయన్న విషయం తమ దృష్టికి వచ్చిందని సుప్రీంకోర్టు ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. 'పర్సన్' అంటే వయసు, లింగ భేదం లేకుండా ప్రతి వ్యక్తినీ సూచిస్తుందని స్పష్టం చేసింది. పెద్దలు అదృశ్యమైన సందర్భాల్లో కూడా గతంలో జారీ చేసిన ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలని పేర్కొంది.మిస్సింగ్ ఫిర్యాదు అందిన వెంటనే అవసరమైన పోలీసు బృందాలను రంగంలోకి దించాలని ధర్మాసనం సూచించింది. అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ కోసం చేపట్టే చర్యల్లో తొలి గంటలు అత్యంత కీలకమని పేర్కొంది. ప్రారంభ దశలోనే పోలీసులు వేగంగా స్పందిస్తే తప్పిపోయిన వ్యక్తిని సురక్షితంగా గుర్తించే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని వివరించింది.మిస్సింగ్ కేసును సాధారణ ఫిర్యాదుగా తీసుకుని కాలయాపన చేయడం వల్ల కీలకమైన సమయం వృథా అవుతుందని కోర్టు అభిప్రాయపడింది. అందువల్ల ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి, ఆ వ్యక్తి ఆచూకీ కోసం అవసరమైన చర్యలను సమాంతరంగా ప్రారంభించాలని ఆదేశించింది.అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభించిన తర్వాత కూడా పోలీసుల బాధ్యత ముగిసినట్లు భావించరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. వ్యక్తిని సురక్షితంగా గుర్తించిన వెంటనే ఎలాంటి అనవసర జాప్యం లేకుండా కుటుంబ సభ్యులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది.తమ ఆదేశాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తప్పనిసరిగా పాటించాలని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఆదేశాల అమలులో నిర్లక్ష్యం లేదా ఉల్లంఘన చోటుచేసుకుంటే సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కోర్టు ధిక్కార చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది.ఈ వ్యాఖ్యలతో మిస్సింగ్ కేసుల్లో పోలీసుల తక్షణ స్పందన ఎంత కీలకమో అత్యున్నత న్యాయస్థానం మరోసారి స్పష్టం చేసింది. చిన్నారులు మాత్రమే కాకుండా వయోజనులు సహా ఏ వ్యక్తి అదృశ్యమైనా సమాన ప్రాధాన్యంతో కేసు నమోదు చేసి, వేగంగా గాలింపు చేపట్టాల్సిందేనన్న విషయాన్ని తేల్చిచెప్పింది.

# పత్తికి ఎంఎస్పీ కంటే తక్కువ ధర వద్దు



**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 11:**

తెలంగాణలో పత్తి కొనుగోళ్ల సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రైతులు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కంటే తక్కువకు పత్తిని విక్రయించాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోళ్లలో మధ్యవర్తుల జోక్యాన్ని అరికట్టి అన్నదాతకు నేరుగా మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.2026-27 పత్తి సీజన్ ఏర్పాట్లపై సీసీఐ అధికారులతో మంత్రి తుమ్మల మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనాలు, కొనుగోలు కేంద్రాలు, జిన్నింగ్ మిల్లుల ఏర్పాటు, రైతులకు అందించాల్సిన సౌకర్యాలపై అధికారులతో చర్చించారు.ప్రస్తుత సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతున్నట్లు అంచనా వేసినట్లు మంత్రి తెలిపారు. సుమారు 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా ఉందన్నారు. రైతుల నుంచి పత్తి కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.లాంగ్ స్టేపుల్ కాటన్‌కు ఈ సీజన్‌లో రూ.8,667 ఎంఎస్పీగా నిర్ణయించినట్లు తుమ్మల తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎంఎస్పీ రూ.557 పెరిగిందని పేర్కొన్నారు. పెరిగిన మద్దతు ధర రైతులకు పూర్తిస్థాయిలో అందేలా కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు.పత్తి కొనుగోళ్లను మరింత విస్తరించేందుకు సీసీఐ కేంద్రాల సంఖ్యను 122 నుంచి 131కి పెంచినట్లు మంత్రి వెల్లడించారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు ఎక్కువ దూరం వెళ్లాల్సిన అవసరం లేకుండా కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.రాష్ట్రంలో మొత్తం 356 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేయాలని తుమ్మల అధికారులను ఆదేశించారు. 15 నుంచి 30 రోజుల్లో అన్ని జిల్లాల్లో అవసరమైన జిన్నింగ్ మిల్లులను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రైతులకు వేగంగా సేవలు అందేలా జిల్లా స్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు.రైతుల ప్రతినిధులతో జిల్లా మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. కొనుగోళ్ల ప్రక్రియలో రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేలా ఈ కమిటీలు పనిచేయాలని చెప్పారు. పత్తి విక్రయాల్లో మధ్యవర్తులకు అవకాశం లేకుండా నేరుగా కొనుగోళ్లు జరపాలని స్పష్టం చేశారు.కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళీకరించే చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. అధిక దిగుబడులు సాధించిన రైతులకు వెంటనే డిజిటల్ యీల్డ్ సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. జిన్నింగ్ మిల్లుల్లో పత్తి నాణ్యతను పరీక్షించే పరికరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు, బరువు యంత్రాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తుమ్మల తెలిపారు. ఎక్కడైనా రద్దీ లేదా పత్తి కొనుగోళ్లలో పెండింగ్ ఏర్పడితే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.పత్తి కొనుగోళ్లకు సంబంధించి రైతులు ఫిర్యాదులు, సమస్యలను టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 1800 599 5779, వాట్సాప్ చాట్‌బాట్ 88972 81111 ద్వారా తెలియజేయవచ్చని మంత్రి సూచించారు. రైతులకు ఎంఎస్పీ ధర అందేలా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.కొనుగోలు ప్రక్రియలో అవకతవకలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. రైతులకు నష్టం కలిగించే ఎలాంటి చర్యలనూ ప్రభుత్వం సహించబోదని, పత్తి సీజన్ మొత్తం అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

# తెలంగాణకు చెందిన 40 కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలి

- **ప్రధానమంత్రిని కోరిన బీసీ కమిషన్ చైర్మన్ జి . నిరంజన్**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 11:**



తెలంగాణ రాష్ట్రానికి చెందిన 40 కులాలను కేంద్ర ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) జాబితాలో చేర్చేందుకు అవసరమైన చర్యలను త్వరితగతిన చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారిని మరోసారి కోరారు.ఈ అంశంపై గౌరవ ప్రధానమంత్రికి పంపిన లేఖలో తెలంగాణకు చెందిన ఈ 40 కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చే అంశం చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని, ముఖ్యంగా కులాల వారి Census 2027 ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ అంశాన్ని త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గతంలో 13 ఏప్రిల్ 2026 తేదీన ప్రధానమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ఈ అంశంపై గతంలో సమర్పించిన వినతికి స్పందిస్తూ, కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ తెలంగాణకు చెందిన 40 కులాల వివరాలను కోరింది. అందుకు అనుగుణంగా తెలంగాణ బీసీ కమిషన్ 18 జూలై 2026 తేదీన ఆయా 40 కులాల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి పంపించింది.అనంతరం 3 ఆగస్టు 2026 తేదీన కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ డైరెక్టర్ పంపిన లేఖలో, కేంద్ర ఓబీసీ జాబితాలో కులాలను చేర్చడం లేదా తొలగించడం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 342ఏ నిబంధనల ప్రకారం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ అంశం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య అని జి. నిరంజన్ తెలిపారు . సంబంధిత కులాల్లో కొన్ని 2008లోనే తెలంగాణ రాష్ట్ర బీసీ జాబితాలో చేర్చబడ్డాయని, అయితే అప్పటి నుంచి మిగతా కులాలు కేంద్ర ఓబీసీ జాబితాలో స్థానం కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు.ఈ అంశానికి సంబంధించి జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (NCBC) న్యూఢిల్లీలో రెండు దఫాలుగా విచారణలు నిర్వహించిందని వివరించారు. మొదటి విచారణలు 22 డిసెంబర్ 2021 నుంచి 24 డిసెంబర్ 2021 వరకు, రెండవ విచారణ 5 సెప్టెంబర్ 2023న జరిగాయని పేర్కొన్నారు. అయినప్పటికీ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 342ఏ ప్రకారం ఈ అంశానికి ఇంకా తుది పరిష్కారం లభించలేదని తెలిపారు.ఈ ఆలస్యం కారణంగా సంబంధిత 40 కులాలకు చెందిన ప్రజలు కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రవేశాలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో లభించే ఓబీసీ అవకాశాలను కోల్పోతున్నారని జి. నిరంజన్ పేర్కొన్నారు.కాబట్టి తెలంగాణకు చెందిన 40 కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో గౌరవ ప్రధానమంత్రి గారు తగిన జోక్యం చేసుకోవాలని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ విజ్ఞప్తి చేశారు. సంబంధిత వర్గాలకు సామాజిక న్యాయం మరియు వారికి లభించాల్సిన అవకాశాలు అందేలా ఈ అంశాన్ని అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు.

# నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తి కావాల్సిందే

**హైదరాబాద్ (సెక్రటేరియట్) వెలుతురు ఆగస్టు 11:**

ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల పురోగతిపై రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం డా.బి.ఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమీక్షలో ఆర్ అండ్ బి సి.ఈ ధర్మారెడ్డి,పలువురు అధికారులు,నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిర్ణీత గడువులోగా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తి కావాల్సిందేనని,నిర్లక్ష్యాన్ని,పనుల్లో ఆలస్యాన్ని అస్సలు సహించేది లేదని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.అటు వైపు నిత్యం ప్రయాణించే వారికి ఏళ్ల తరబడి నరకప్రాయంగా మారిందని,అందు కోసమే 2026 దసరా నాటికి పూర్తి చేస్తామని ప్రజలకు మాట ఇచ్చాం...మాట ప్రకారం చేసి తీరాల్సిందేనని సమీక్షలో మంత్రి పునరుద్ఘాటించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పూర్తి జవాబుదారిగా వ్యవహరిస్తుందనీ,ఏళ్ల తరబడి అవస్థ పడుతున్న ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సురక్షిత ప్రయాణం అందించేలా చేద్దామని,అందుకు అనుగుణంగా అధికారులు మనసుపెట్టాలని ప్రత్యేకంగా కోరారు.మ్యాన్ పవర్ పెంచి..మూడు షిఫ్టుల్లో పనులు చేయాలనీ,రాత్రి వేళల్లో 11 నుండి ఉదయం 6గంటల వరకు నిరంతరాయంగా పనులు జరగాలనీ మంత్రి ఆదేశించారు.కారిడార్ కింద 6.25కి.మీ బిటి రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని తేల్చి చెప్పారు.ప్రతి పది రోజులకు ఒకసారి తాను స్వయంగా క్షేత్రస్థాయి పనుల పురోగతి సమీక్షిస్తానని..అందుకు తగ్గట్టుగా రోజువారీ వర్క్ ప్రోగ్రెస్ అధికారులు సమీక్షించాలని మంత్రి ఆదేశించారు.ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో నడుస్తున్న పనులపై మంత్రి కూలంకషంగా చర్చించారు.. సైట్ లోని కచ్చితమైన వాస్తవ పరిస్థితులు చెప్పాలని మంత్రి అధికారులు,వర్క్ ఏజెన్సీని అడిగారు.ప్రస్తుతం ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ 60% మేర పనులు పూర్తయ్యాయని మరో 40% పనులు వేగంగా జరుగుతున్నాయని అధికారులు,వర్క్ ఏజెన్సీ ప్రతినిధులు వివరించారు.సైట్లో సెగ్మెంట్ తయారు చేయుటకు నాలుగు బెడ్లు,నాలుగు గ్యాంట్రీస్ తో 300మంది కార్మికులు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారనీ మంత్రికి చెప్పారు.అటు నారపల్లి(CPRI) వైపు నుండి,ఇటు ఉప్పల్ వైపు నుండి..ఇరువైపుల లాంచింగ్ గడ్డర్లతో పనుల్లో వేగం పెంచాలనీ మంత్రి సూచించారు. ఉప్పల్ వైపు నుండి జరుగుతున్న పనుల పురోగతిని మంత్రి ఆరా తీశారు..ఇప్పటికే ఒక స్లాబ్ పూర్తయిందని,రెండో స్లాబ్ పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు.ప్రస్తుత పరిస్థితుల్లో రాత్రిపూట పనుల వల్ల,వర్షాల వల్ల నిర్మాణం పూర్తికి మరింత సమయం పట్టే అవకాశం ఉన్నదనీ నిర్మాణ సంస్థ సమీక్ష సందర్భంగా విజ్ఞప్తి చేసింది.2026 అక్టోబర్ 31 నాటికి అందుబాటులోకి తెస్తామని ఇప్పటికే డెడ్ లైన్ పెట్టుకున్నాం..ప్రజల ట్రాఫిక్ ఇబ్బందులు గురించి ఆలోచించాలని మంత్రి అన్నారు.

వర్క్ ఏజెన్సీ విజ్ఞప్తి పట్ల మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.పనుల్లో మరింత వేగం పెంచాలని,మ్యాన్ పవర్ పెంచి మూడు షిఫ్టుల్లో పనిచేయాలని తెగేసి చెప్పారు. నెలకు ఆరు స్లాబుల చొప్పున పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థ మంత్రికి తెలిపింది.దీనికి అనుసంధానంగా GHMC నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులపై ఆరా తీసిన మంత్రి GHMC అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు సమాంతరంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.2026 సంవత్సరంలో ఎట్టి పరిస్థితుల్లో ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిందేనని ఆర్ అండ్ బి అధికారులు,వర్క్ ఏజెన్సీ ఆ దిశగా పనిచేయాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# టెస్రాక్ట్ భూ కేటాయింపులపై వెనక్కి తగ్గం

- **కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 11:**



టెస్రాక్ట్ సంస్థకు సంబంధించిన భూ కేటాయింపుల వ్యవహారాన్ని వదిలి పెట్టబోమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యుల పాత్రపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. షెల్ కంపెనీల వ్యవహారాన్ని బయటకు తీసుకొస్తామని హెచ్చరించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. టెస్రాక్ట్ సంస్థ, భూముల కేటాయింపు, ప్రభుత్వ పెద్దల సంబంధాలపై తీవ్ర ఆరోపణలు చేశారు.టెస్రాక్ట్ సంస్థకు అనుముల కొండల్‌రెడ్డి చైర్మన్‌గా ఉన్నట్లు ఆయనే చెప్పుకున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. అలాంటప్పుడు మంత్రి శ్రీధర్‌బాబు ఆ సంస్థతో కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని ఎలా చెబుతారని ప్రశ్నించారు. సంస్థలో ఒక్క ఉద్యోగి కూడా లేరని, కేవలం రూ.లక్షతో ఏర్పాటైనట్లు చెబుతున్న కంపెనీకి భారీ విలువైన భూములు ఎలా కేటాయించారని నిలదీశారు.రూ.2 వేల కోట్ల విలువైన భూమిని రూ.7 వేల కోట్లకు కేటాయించారంటూ కేటీఆర్ ఆరోపించారు. ఈ భూ కేటాయింపుల వెనుక ఉన్న పూర్తి వ్యవహారాన్ని ప్రజల ముందుకు తీసుకువస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు సూటు, బూటు వేసుకుని కంపెనీలు ఎలా ఏర్పాటు చేశారో కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.తన శాఖలో జరుగుతున్న వ్యవహారాల గురించి మంత్రి శ్రీధర్‌బాబుకు తెలియదా? లేక ముఖ్యమంత్రి ఒత్తిడికి తలొగ్గుతున్నారా? అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. కొండల్‌రెడ్డికి టెస్రాక్ట్‌తో సంబంధం లేదని చెబుతున్నప్పుడు.. ఆయన అమెరికా కాన్సులేట్ సమావేశానికి ఎలా వెళ్లారని నిలదీశారు.ఇదే సమయంలో తిరుపతిరెడ్డి అధికారిక సమావేశాలకు ఏ హోదాలో హాజరవుతున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజలకు పట్టాలు పంపిణీ చేసే కార్యక్రమాల్లో ఆయన ఏ అధికారిక హోదాతో పాల్గొంటున్నారని నిలదీశారు. ఈ మొత్తం వ్యవహారంపై రాష్ట్ర గవర్నర్‌ను కలిసి విచారణ కోరుతామని వెల్లడించారు.భూ కేటాయింపుల అంశంలో ఎలాంటి రాజీ ఉండదని కేటీఆర్ స్పష్టం చేశారు. సంబంధిత పత్రాలు, నిర్ణయాలు, అధికారిక హోదాలపై ప్రశ్నలు లేవనెత్తుతూ ప్రభుత్వాన్ని సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టెస్రాక్ట్ వ్యవహారంపై బీఆర్ఎస్ పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.ఇక రాష్ట్ర ఓటర్ల జాబితాపైనా కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 74 లక్షల ఓట్లు తొలగించే అవకాశం ఉందన్న ప్రచారం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత పార్టీ నేతలు న్యాయ నిపుణులతో చర్చించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా బీఆర్ఎస్ తరఫున చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉంటుందని తాము భావిస్తున్న కృష్ణా జలాల అంశాన్ని కూడా కేటీఆర్ ప్రస్తావించారు. జీఆర్ఎంబీ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం హాజరవుతుందా లేదా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. జలసౌధలో జరిగే జీఆర్ఎంబీ సమావేశం అజెండాను మార్చకపోతే కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడం సాధ్యం కాదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. తెలంగాణకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో పార్టీ రాజకీయాలకు అతీతంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.వర్షాలు సమృద్ధిగా కురవాలని వరుణ యాగాలు చేయడాన్ని తప్పుపట్టడం లేదని కేటీఆర్ అన్నారు. అయితే ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం చేయాల్సిన పనులను కూడా సమర్థంగా నిర్వహించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఓల్డ్ సిటీ మెట్రో పనుల్లో వేగం పెంచండి

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 11:**

హైదరాబాద్ మెట్రోరైలు రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (HMRL)పై సీఎం ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాతబస్తీ మెట్రో పనులపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ పొడవునా రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ కారిడార్ లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను మొదలు పెట్టాలని తెలిపారు. మెట్రో విస్తరణకు సంబంధించి పెండింగ్ లో ఉన్న భూ సేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. హైదరాబాద్ మెట్రోకు రోజురోజుకు రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయాణీకుల రద్దీకి తగినట్టుగా మెట్రో రైల్ కు అదనపు బోగీలను జత చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి మెట్రో రైల్ కోచెస్ ను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మెట్రో ఫేజ్-2 లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ కారిడార్ కోసం ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రోను సంప్రదించి అవసరమైన సలహాలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

## డిసెంబర్ లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

డిసెంబర్ లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. సమ్మిట్ నిర్వహణకు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి ఏర్పాట్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాపార రంగంలో వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్ లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది నిర్వహించిన సమ్మిట్ లో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, పురోగతికి సంబంధించి పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు, ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# కేరళ ఇక 'కేరళం'

- **లోక్‌సభలో బిల్లుకు ఆమోదం**
- **రాష్ట్రం పేరులో అధికారిక మార్పు**
- **లోక్‌సభలో బిల్లుకు గ్రీన్‌సిగ్నల్**
- **విపక్షాల నిరసనల మధ్యే ప్రక్రియ**
- **మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం**
- **కేంద్రం ప్రతిపాదించిన సవరణ బిల్లు**
- **రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు అనుగుణంగా**
- **మలయాళంలో 'కేరళం'గా వాడుక**
- **రాజ్యాంగపరమైన మార్పునకు చర్యలు**
- **బిల్లును రాజ్యసభకు పంపనున్న కేంద్రం**
- **విద్యార్థుల అంశంపై విపక్షాల ఆందోళన**

**న్యూఢిల్లీ, వెలుతురు, ఆగస్టు 11:**

కేరళ రాష్ట్రం అధికారిక పేరును 'కేరళం'గా మార్చేందుకు ఉద్దేశించిన సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. విపక్ష సభ్యులు సభలో ఆందోళన చేస్తున్న సమయంలోనే బిల్లును ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. అనంతరం మూజువాణి ఓటుతో ఆమోదింపజేసింది. రాష్ట్ర అధికారిక పేరును మలయాళంలో ఇప్పటికే 'కేరళం'గా ఉపయోగిస్తున్న నేపథ్యంలో అదే పేరును రాజ్యాంగపరంగా గుర్తించాలన్న డిమాండ్ చాలాకాలంగా కొనసాగుతోంది.రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చాలని కేరళ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. మలయాళ భాషలో రాష్ట్రాన్ని 'కేరళం'గానే పిలుస్తున్నారని, అదే పేరుకు అధికారిక గుర్తింపు కల్పించాలన్న ఉద్దేశంతో సవరణ చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది.అయితే బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో పార్లమెంట్‌లో విపక్ష సభ్యులు నిరసనలకు దిగడంతో కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఇతర అంశాలపై కేంద్రాన్ని నిలదీస్తూ విపక్షాలు ఆందోళన కొనసాగించినప్పటికీ.. ప్రభుత్వం కేరళం పేరుమార్పు బిల్లుపై ప్రక్రియను ముందుకు తీసుకెళ్లింది.విపక్షాల నిరసనల మధ్యే బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టి, అనంతరం మూజువాణి ఓటుతో ఆమోదించారు. దీంతో రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చే ప్రక్రియలో మరో కీలక అడుగు పడింది.లోక్‌సభ ఆమోదం అనంతరం తదుపరి దశలో బిల్లును రాజ్యసభకు పంపనున్నారు. అక్కడ కూడా ఆమోదం లభించిన తర్వాత రాజ్యాంగపరమైన ప్రక్రియ పూర్తవుతుంది. అనంతరం రాష్ట్ర అధికారిక పేరులో మార్పు అమల్లోకి వచ్చే అవకాశం ఉంటుంది.ఇదిలా ఉండగా.. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులపై పోలీసుల చర్యల అంశాన్ని కూడా విపక్షాలు పార్లమెంట్‌లో ప్రస్తావించాయి. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ నిరసనల నడుమే కేరళం పేరుమార్పు బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించింది.



# అక్రమ ఇసుక వసూళ్లను అరికట్టాలని టీజీఎండీసీ కార్యాలయం ఎదుట లారీ యజమానుల ధర్నా

- **రూ.15,650 డీడీ చెల్లించినా రూ.3,000 –రూ.4,000 అదనపు వసూళ్లు**
- **కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి.. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి**

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 11:**





తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ టీజీఎండీసీ ఆధ్వర్యంలో అధికారికంగా లోడింగ్ నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌లలో లారీ యజమానులు, డ్రైవర్ల నుంచి అక్రమంగా అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలను నిరసిస్తూ జంట నగరాల్లోని వివిధ ఇసుక లారీ యజమానుల సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఖైరతాబాద్‌లోని టీజీఎండీసీ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా లారీ యజమానులు, సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.15,650 డీడీ చెల్లించి, అధికారిక ప్రక్రియ పూర్తి చేసుకుని లోడింగ్‌కు వెళ్లిన లారీల నుంచి కూడా కాంట్రాక్టర్లు అదనంగా రూ.3,000 నుంచి రూ.4,000 వరకు లోడింగ్ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.అదనపు డబ్బులు చెల్లిస్తేనే లారీకి లోడింగ్ చేస్తామని, లేదంటే "దిక్కున్న చోట చెప్పుకోండి.. లోడింగ్ చేయం" అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని లారీ యజమానులు, డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ అక్రమ వసూళ్ల కారణంగా లారీ యజమానులపై తీవ్ర ఆర్థిక భారం పడటంతో పాటు, డ్రైవర్లు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారికంగా చెల్లింపులు చేసిన తర్వాత కూడా అదనపు డబ్బులు వసూలు చేయడం ఎందుకని TGMDC అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### అధికారుల పాత్రపై విచారణ జరపాలి

ఇసుక రీచ్‌లలో జరుగుతున్న అక్రమ వసూళ్లపై TGMDC ఇన్‌చార్జిలు, ప్రాజెక్టు అధికారుల పర్యవేక్షణలోనే అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు సంఘాల నాయకులు చేశారు.

అక్రమ వసూళ్లను అడ్డుకోవాల్సిన కొంతమంది అధికారులు కాంట్రాక్టర్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులైన అధికారులను పదవి బాధ్యతల నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

### అక్రమ వసూళ్ల కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి

ఇసుక రీచ్‌లలో అధికారికంగా నిర్ణయించిన చెల్లింపులకు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్న కాంట్రాక్టర్లపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడినట్లు తేలిన కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రీచ్‌లలో పారదర్శకమైన లోడింగ్ విధానం, పటిష్టమైన అధికారుల పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని కోరారు.

### డ్రైవర్లపై దాడులు చేస్తున్నారని ఆరోపణ

అదనపు లోడింగ్ డబ్బులు ఇవ్వాలని ప్రశ్నించిన లేదా చెల్లించేందుకు నిరాకరించిన డ్రైవర్లపై కాంట్రాక్టర్లకు చెందిన వ్యక్తులు దాడులకు పాల్పడుతున్నారని లారీ యజమానులు ఆరోపించారు.డ్రైవర్లపై దాడులకు పాల్పడిన వ్యక్తులు, సంబంధిత కాంట్రాక్టర్లపై విచారణ జరిపి, తప్పు చేసినట్లు తేలితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లారీ డ్రైవర్ల భద్రతకు తగిన రక్షణ కల్పించాలని కోరారు.

### వివిధ సంఘాల నాయకులు, వందలాది లారీ యజమానుల పాల్గొనడం

ధర్నా కార్యక్రమంలో ఆటోనగర్ ఇసుక లారీల యజమానుల సంఘం అధ్యక్షులు సుర్వి రాజుగౌడ్, పెద్ద అంబర్‌పేట్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పోలగోని భాస్కర్ గౌడ్, కొత్తపేట అధ్యక్షులు నర్రి వెంకన్న, చక్రిపురం అధ్యక్షులు బలవంత్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీను, కాసుల జంగయ్య గౌడ్ తదితర నాయకులతో పాటు జంట నగరాలకు చెందిన వివిధ ఇసుక లారీ యజమానులు, డ్రైవర్లు వందల సంఖ్యలో పాల్గొన్నారు.

### మూడు రోజుల్లో చర్యలు తీసుకుంటామని టీజీఎండీసీ ఎండీ హామీ

ధర్నా నేపథ్యంలో పోలీసులు మధ్యవర్తిత్వం వహించి టీజీఎండీసీ ఎండీ తో వివిధ లారీ యజమానుల సంఘాల అధ్యక్షులతో చర్చలు జరిపించారు.ఈ సందర్భంగా ఇసుక రీచ్‌లలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమ వసూళ్లు, అవినీతి ఆరోపణలపై చర్యలు తీసుకుంటామని, రానున్న మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని టీజీఎండీసీ ఎండీ హామీ ఇచ్చినట్లు సంఘాల నాయకులు తెలిపారు.ఎండీ ఇచ్చిన హామీ మేరకు లారీ యజమానుల సంఘాల నాయకులు ప్రస్తుతానికి ధర్నాను విరమించారు.అయితే మూడు రోజుల్లోగా అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయకపోతే తదుపరి కార్యాచరణను అన్ని లారీ యజమానుల సంఘాల నాయకులతో చర్చించి నిర్ణయిస్తామని వారు స్పష్టం చేశారు.అధికారికంగా చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించిన లారీ యజమానుల నుంచి అదనపు వసూళ్లు జరగకుండా ప్రభుత్వం, టీజీఎండీసీ ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సంఘాల నాయకులు కోరారు. లారీ యజమానులు, డ్రైవర్లపై అదనపు ఆర్థిక భారం మరియు వేధింపులకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు.

# ప్రతిష్టాత్మకంగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026



- **డిసెంబరులో నిర్వహించేందుకు ఏర్పాట్లు**
- **మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకోండి**
- **క్రీడా స్ఫూర్తిని చాటేలా పోటీలు ఉండాలి**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 11:**

తెలంగాణ ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెఆర్డీలోని బోధి పెవిలియన్ లో ఖేలో ఇండియా యూత గేమ్స్ ఏర్పాట్లు, నిర్వహణపై మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొనే ఈ పోటీలకు సంబంధించి మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. డిసెంబరులో పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ లోని స్టేడియంలలో ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, క్రీడా పోటీలకు అనుగుణంగా శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రారంభోత్సవ, ముగింపు వేడుకలకు సంబంధించిన ముఖ్య అతిథులు, ప్రముఖ క్రీడాకారులు, సినీ ప్రముఖులను కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాలన్నారు.

మౌలిక వసతులు, క్రీడల నిర్వహణ, అతిథులకు కావాల్సిన సౌకర్యాల ఏర్పాట్లకు సంబంధించి పని విభజన చేసుకుని బాధ్యత తీసుకోవాలని తెలిపారు.

తెలంగాణకు చెందిన అర్జున అవార్డు గ్రహీతలు, తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు సభ్యులు, ఒలింపిక్స్ అసోసియేషన్ తో పాటు జాతీయస్థాయి క్రీడా ప్రతినిధులను కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో భాగంగా 20 రకాల స్పోర్ట్స్ కు సంబంధించిన పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో... క్రీడా విభాగాల వారీగా పోటీ ప్రదేశాలను గుర్తించి ఏర్పాట్లు చేయాలన్నారు. క్రీడా స్ఫూర్తిని చాటేలా నిర్వహణ ఉండాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, SATG చైర్మన్ శివసేనా రెడ్డి, క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, SATG ఎండీ సోనీబాల దేవి పాల్గొన్నారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com